PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 126 | విజయవాడ, గురువారం 7 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 7 December 2023 | Rs

కేంద్రంలో పేరుకుపోతున్న 'ఉపాధి' బకాయిలు

- రాష్ట్రానికి వేతన బకాయిలే రూ.110.56 కోట్లు
- సకాలంలో ఇవ్వకుండా వంచిస్తున్న మోడీ సర్కార్

7

షెఫాలీ మెరిసినా..

- తొలి టి20లో ఇంగ్లండ్ మహిళల చేతిలో ఓటమి
- వాట్, బ్రంట్ అర్ధసెంచరీలు

8



సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై

కేంద్రం నిర్లక్ష్యం

ఏడాదిలో రూ.13,961.54 కోట్ల కేటాయింపులు రద్దు

ఐదేళ్లలో మురిగిపోయిన రూ.71,686 కోట్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దళితుల సాధికారత, సంక్షేమం కోసం షెడ్యూల్డ్ తరగతుల ఉపప్రణాళిక (ఎస్‌సి సబ్‌ప్లాన్) నిధుల వినియోగంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి యేటికేడూ ఎస్‌సి సబ్‌ప్లాన్‌కు నిధుల కేటాయింపును తగ్గిస్తూ వస్తున్న మోడీ సర్కార్ కేటాయించిన అరకొర నిధులను ఖర్చు చేయడంలోనూ ఘోరంగా విఫలమవుతోంది. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి గత ఐదేళ్లలో ఎస్‌సి సబ్ ప్లాన్‌కు సంబంధించిన సుమారు రూ.72 వేల కోట్ల నిధులు ఖర్చు కాకుండానే మురిగిపోయాయి. సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై రాజ్యసభలో బుధవారం నాడు సిపిఎం ఎంపి వి శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి రాందాస్ అథవాలే రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2022-23లో రూ.13,961.54 కోట్ల ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయలేకపోయామని, దీంతో ఆ మొత్తం నిధులు రద్దయ్యాయని మంత్రి తెలిపారు. గత ఐదేళ్లలో సకాలంలో నిధులను ఖర్చు చేయనందున మొత్తం రూ.71,686.43 కోట్ల సబ్‌ప్లాన్ నిధులు మురిగిపోయినట్లు ఆయన పేర్కొన్నారు. దళితోద్ధరణకు ఎంతో కృషి చేస్తున్నామంటూ ఎక్కడ ఏ ఎన్నికలు జరిగినా ఊదరగొట్టే బిజెపి పెద్దలు సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో నిర్లక్ష్యానికి ఏం సమాధానం చెబుతారని సామాజిక వేత్తలు నిలదీస్తున్నారు.

ఏడాది	మురిగిపోయిన నిధులు
2018-19	రూ.9,818.24 కోట్లు
2019-20	రూ.11,042.26 కోట్లు
2020-21	రూ.19,922.35 కోట్లు
2021-22	రూ.16,942.04 కోట్లు
2022-23	రూ.13,961.54 కోట్లు
మొత్తం	రూ.71,686.43 కోట్లు

జమ్మూకాశ్మీర్ బిల్లులకు లోక్‌సభ ఆమోదం

- పిఒకె భారతదేశానిదే
- అక్కడ 24 స్థానాల్ని రిజర్వ్ చేశాం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

కల్బుర్గి, గౌరీ లంకేష్ హత్య కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు

- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదేశాలు

లోపలి పేజీలో..

అంతులేని నష్టం

- ఇంకా ముంపులోనే పొలాలు, వరి పనలు
- ధాన్యం కొనేవారి కోసం రైతుల ఎదురు చూపులు
- ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు



కాకినాడ జిల్లా పెద్దాపురంలో నేలకొరిగిన కర్రపెండలం దుంప తోట

ప్రజాశక్తి - యంత్రాంగం

మిచౌంగ్ తుపాన్ అపార నష్టాన్ని మిగిల్చింది. వరి, శనగ, పెసర, కంది, మొక్కజొన్న, మినప, మిరప, పొగాకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పత్తి పూత రాలిపోయింది. పొలాల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో పంట ఎందుకూ పనికి రాదని పలువురు రైతులు కన్నీరు మున్నీరయ్యారు. కళ్లాల్లోనూ, రోడ్లపైనా ఆరబోసిన ధాన్యం తడిచి ముద్దవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పడిపోయిన పంటలను నెలబెట్టుకొని, తడవగా మిలిగిన ధాన్యాన్ని కాపాడుకొనే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వర్షాలకు తడిచిపోయిన వరి పనలను ఆరబెట్టుకుంటున్నారు. ఆదుకొనే వారి కోసం ఎదురు చేస్తున్నారు. పంట నష్టాల అంచనాల్లో అధికారులు ఉన్నారు. వర్షాలు తెరిపిచ్చినా పలు వాగులు ఇంకా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు ఇంకా పునరుద్ధరణ జరగలేదు. అల్లూరి జిల్లాలో గెడ్డలో ముగ్గురు గిరిజనులు గల్లంతయ్యారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఇప్పుడు వర్షాలు ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అత్యధికంగా 43.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జి.సిగడాం రైల్వే అండర్ పాసేజ్ మార్గంలోకి భారీగా వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. విజయనగరం ఉమ్మడి జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వరికి నష్టం వాటిల్లింది. సువర్ణముఖీనది, గోముఖీ నదులు ఉధృతంగా ప్రవహించడంతో వెంగళరాయసాగర్ నుంచి నీటిని కిందికి అధికారులు విడుదల చేశారు.

మంగళవారం వరకూ కురిసిన భారీ వర్షాలకు ఎన్‌టిఆర్ జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో వరి, మినుము, పత్తి , వేరుశనగ వంటి పంటలకు నష్టం వాటిల్లిందని కలెక్టర్ తెలిపారు. మొత్తం 29 సబ్ స్టేషన్ల పరిధిలో 199 విద్యుత్ స్తంభాలు, 25 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని 52 సంచార బృందాలను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ తక్షణమే దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను, పరికరాలను పునరుద్ధరించే ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా లక్ష ఎకరాల్లో పంటలు ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. పత్తి, మిర్చి, జొన్న, మొక్కజొన్న, శనగ, అపరాలు పొగాకు పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 68,055 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరి, మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశనగ, పొగాకు, పత్తి పంటలు నీటిలో ఉన్నాయి. ధాన్యపురాశులు తడిసి ముద్దవడమే కాకుండా, పలుచోట్ల ధాన్యం కొట్టుకుపోయింది. మిరప, బొప్పాయి, అరటి, కూరగాయలు, పామాయిల్ వంటి ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 37,500 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో 33,277 ఎకరాల్లో వరి ఉంది. ఉద్యాన పంటల నష్టం అంచనా వేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. బాపట్ల జిల్లా నల్లమడ ఎగువ ప్రాంతంలో ఎడతెరిపిలేని వర్షాల వల్ల వరద నీటి ఉధృతికి నల్లమడ వాగుకు రెండు చోట్ల గండ్లు పడ్డాయి. జిల్లెళ్లమూడి బ్రిడ్జి వద్ద పిటి ఛానల్‌కు మధ్య నల్లమడ వాగు కట్ట మట్టిని గతంలో తొలగించడంతో మరింత బలహీనపడంతో అక్కడా గండి పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో, సంచుల్లో ఇసుక నింపి వరద నీటి ప్రవాహానికి కొంతమేర అడ్డుకట్ట వేశారు. ప్రకాశం జిల్లాలో మొత్తం 56,880 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని జెడిఎ శ్రీనివాసరావు తెలిపారు. పొగాకు 23,650 ఎకరాలు, మినుము 5972 ఎకరాలు, శనగ 11,460 ఎకరాలు, ఇతర పంటలు 15,798 ఎకరాలలో నష్టం జరిగిందని పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలో 1.75 లక్షల ఎకరాలలో ధాన్యం నీట మునిగిందని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. నెల్లూరు జిల్లాలో వరి ఆకు, నారు మడుల్లో నీరు నిల్చే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పడిపోయిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు పునరుద్ధరించి విద్యుత్ సరఫరా చేయడం ప్రజలు కొంత

మిగతా2లో

అల్లూరి జిల్లాలో ముగ్గురు గల్లంతు

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ సీతపాడు గ్రామానికి చెందిన గిరిజనులు గెమ్మెలి లక్ష్మి, మిరియాల కమల, గెమ్మెలి కుమార్... లువ్వ గెడ్డను దాటుతుండగా ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయారు. కాశీపట్నం సంతకు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.



ఉదారంగా సాయం అందించాలి

- అధికారులకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం
- పొలాల్లో నీటి తరలింపు కీలకం
- 80 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు

2

కళ్లెదుటే పంట నీటిపాలు

- సిపిఎం బృందాల వద్ద తుపాను బాధితుల ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- సిఎం ప్రత్యక్షంగా రైతుల బాధలు చూడాలి : వి శ్రీనివాసరావు



కొల్లూరు మండలం, అనంతవరంలో వరి పొలంలో మోకాళ్ల లోతు నీటిలో ఉన్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- యంత్రాంగం

'ఆరుగాలం ఇంటిళ్లపాదీ కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో నీటి పాలైంది. నష్టాలు, అప్పులే మిగిలాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు' అని సిపిఎం బృందాల వద్ద రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే కోలుకోలేమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని తుపాను ప్రాంతాల్లో మూడు సిపిఎం బృందాలు వేర్వేరుగా పర్యటించాయి. రైతులకు జరిగిన నష్టాన్ని కళ్లారా చూశాయి. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతవరం గ్రామంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి బృందం పర్యటించింది. మోకాలు లోతు నీటిలో దిగి రైతులను కలిసి మునిగిపోయిన వరి పొలాన్ని పరిశీలించింది. పొలానికి పక్కనే ఉన్న మురుగు కాలువ పూర్తిగా నిండిపోవడంతో నీరు మరో వారం రోజుల వరకూ బయటకెళ్లే పరిస్థితి లేదని సిపిఎం బృందం వద్ద రైతులు వాపోయారు. అదే గ్రామంలో వర్షానికి తడిచిపోయిన ధాన్యాన్ని రైతులు బయటకు తీస్తుండడంగా ఈ బృందం అక్కడికి వెళ్లి పరిశీలించింది. ధాన్యాన్ని వడగట్టి పనిలో సహకరించింది. ధాన్యంపై తార్పాలిన్లు కప్పినా వర్షానికి తడిసి లోపల మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూపించి రైతులు బోరున విలపించారు.

రూ.20 వేల చొప్పున నష్టపరిహారమివ్వాలి

మొన్నటి వరకు రైతులు కరువుతో నష్టాలపాలు కాగా, నేడు తుపాను వల్ల కోలుకోలేని విధంగా నష్టపోయారని, రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

మిగతా 7లో

నేడు రేవంత్ ప్రమాణస్వీకారం

- ఎల్‌బి స్టేడియంలో మధ్యాహ్నం 1.04గంటలకు ముహూర్తం
- సోనియా, ఖర్గే, రాహుల్, ప్రియాంక, ఎఐసిసి నేతలు హాజరు



ప్రమాణస్వీకారానికి సోనియాను ఆహ్వానిస్తున్న రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా కొడంగల్ ఎమ్మెల్యే, సిఎల్‌పి నేత ఎ. రేవంత్ రెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం 1.04 గంటలకు రేవంత్ రెడ్డి చేత రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రమాణం చేయించనున్నారు. ఎల్‌బి స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం, టిపిసిసి పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. రేవంత్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎఐసిసి అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ సిఎంలు, మాజీ సిఎంలు చంద్రబాబు, కెసిఆర్, పలువురు జాతీయ నాయకులు, సినీ, క్రీడా ప్రముఖులకు కాంగ్రెస్ పార్టీ ఆహ్వానాలు పంపింది. తొలుత గురువారం ఉదయం 10.27గంటలకు ప్రమాణస్వీకార ముహూర్తం నిర్ణయించినప్పటికీ ఢిల్లీ నుంచి వచ్చే ఆహ్వానితులు, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే కాంగ్రెస్ అభిమానులు, నాయకులను దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నానికి మార్పుచేశారు. ప్రమాణస్వీకారం అనంతరం ఆరు గ్యారెంటీల దస్త్రంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతకం చేయనున్నట్లు కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నాయి. టిజెఎస్, సిపిఐ, సిపిఎం నాయకులకు, వైఎస్‌ఆర్‌టిపి, టిడిపి నేతలకు ఆహ్వానం పంపారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఎల్‌బి స్టేడియంలో ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి రవిగుప్త, జిఎడి, జిహెచ్‌ఎంసి అధికారులు బుధవారం పరిశీలించారు. సిఎల్‌పి నేతగా రేవంత్ రెడ్డి పేరును సమర్థిస్తూ 64మంది ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన జాబితాను కాంగ్రెస్ ప్రతినిధి బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ కార్యదర్శి సురేంద్రమోహన్‌కు అందజేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సిఎల్‌పి నేత రేవంత్‌రెడ్డికి గవర్నర్ ఆహ్వానం పంపారు.

విశాఖకు క్యాంప్ ఆఫీస్ జిఓపై రిట్

- ప్రభుత్వ అభ్యంతరం
- విచారణ రేపటికి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నంలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలు గుర్తిస్తూ జారీ చేసిన జిఓను సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ దాఖలైంది. దీని వెనుక దురుద్దేశం ఉందని ప్రభుత్వం వాదించింది. ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష నిమిత్తం ఐఎఎస్‌ల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు జిఓ 2283ను జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిని రాజధాని రైతులు సవాల్ చేయడాన్ని ప్రభుత్వం తరపున ఎజి ఎస్.శ్రీరామ్ అభ్యంతరం చెప్పారు. పిల్‌గా వేయవలసిన దానిని, రిట్‌గా దాఖలు చేశారని ఇది ఫోరం షాపింగ్ (తమకు కావాల్సిన న్యాయమూర్తి వద్దకు వ్యాజ్యం వచ్చేలా చేయడం) అవుతుందని వాదించారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను ప్రస్తావించారు. జిఓ 2283ను రద్దు చేయాలని, ఈలోగా స్టే ఇవ్వాలంటూ అమరావతి పరిరక్షణ సమితి మేనేజింగ్ ట్రస్టీ గద్దె తిరుపతిరావు, రాజధాని రైతులు మాదాల శ్రీనివాసరావు, వలపర్ల మనోహరం వేసిన వ్యాజ్యాలను జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం విచారించారు. ఎజి వాదనల కొనసాగింపు కోసం విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఇక డిజిటల్ తనిఖీతోనే సిమ్ కార్డుల జారీ

- కొత్త ఏడాది నుంచి అమలు : ట్రాయ్

న్యూఢిల్లీ : ఇప్పటి వరకు కాగితపు ఆధారిత గుర్తింపుతో ఇస్తున్న సిమ్ కార్డుల జారీని టెలికం శాఖ (డిఒటి) నిలిపివేస్తోంది. వచ్చే జనవరి 1వ తేదీ నుంచి పూర్తిగా డిజిటల్ వెరిఫికేషన్‌ను తీసుకొస్తోంది. దీనివల్ల సిమ్ కార్డుల మోసాలను సైతం అరికట్టవచ్చని భావిస్తుంది. ఎప్పటికప్పుడు మారుతున్న కెవైసి నిబంధనల్లో భాగంగా మార్పులు చేపట్టామని టెలికాం శాఖ నోటిఫికేషన్‌లో తెలిపింది. 2012 నుంచి అనుసరిస్తున్న కాగితపు విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు స్పష్టం చేసింది. కొన్ని టెలికం సంస్థలు ఇప్పటికే డిజిటల్ విధానాన్ని అవలంభిస్తున్నప్పటికీ.. పేపర్ ఆధారిత కెవైసిని కూడా అనుమతిస్తున్నాయి. ఇకపై పూర్తి స్థాయిలో డిజిటల్‌గా మార్చనున్నాయి. డిఒటి తీసుకున్న నిర్ణయం పట్ల భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా కంపెనీలు హర్షం వ్యక్తం చేశాయి. డిజిటల్ విధానం వల్ల వినియోగదారులను చేర్చుకునేందుకు ఆయా కంపెనీలకు అయ్యే ఖర్చు తగ్గుతుందని భావిస్తున్నాయి.

కర్ణిసేన నేత హత్యతో రాజస్థాన్‌లో ఉద్రిక్తత

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు



జైపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కర్ణిసేన మద్దతుదారులు

జైపూర్ : రాజస్థాన్‌లో బుధవారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన అధ్యక్షులు సుఖ్‌దేవ్ సింగ్ గోగమేది దారుణహత్య నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. రాజధాని జైపూర్‌లో రాజ్‌పుత్‌లు బంద్ నిర్వహించారు. జైపూర్‌తో పాటు బుండి, అజ్మేర్, మధోపూర్, చిత్తోర్‌ఘఢ్ వంటి జిల్లాలోనూ కార్యాలయాలు, పాఠశాలలు, దుకాణాలు మూసివేశారు. జైపూర్‌లోని ఖాతిపురా రహదారిని ఆందోళనకారులు దిగ్బంధించారు. సుఖదేవ్ సింగ్ గోగమేది మృత దేహాన్ని ఉంచిన మెట్రో మాస్ ఆసుపత్రి వద్ద భారీ సంఖ్యలో కర్ణిసేన మద్దతుదారులు మోహరించారు. గోగమేది హత్యకు రాష్ట్ర పోలీసులదే బాధ్యత అని రాజ్‌పుత్ కర్ణిసేన జాతీయ అధ్యక్షులు మహిపాల్ సింగ్ మక్రాన్ ఆరోపించారు. 'గోగమేది హత్య గురించి పంజాబ్ పోలీసుల నుంచి ఇంటెలిజెన్స్ నివేదిక వచ్చింది. కానీ రాజస్థాన్ పోలీసులు ఆయనకు భద్రత కల్పించ లేదు. ఇది పోలీసుల వైఫల్యం' అని మక్రాన్ స్పష్టం చేశారు. డిజిని తొలగించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను పట్టుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు. గోగమేది హత్యపై కేవలం రాజ్‌పుత్‌లే కాకుండా ప్రజలందరూ ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గోగమేది కుటుంటానికి రూ. 11 కోట్ల పరిహారం ఇవ్వాలని ఆందోళనకారలు డిమాండ్ చేశారు. ఉదయ్‌పూర్‌లో జిల్లా కలెక్టరేట్ ముందు వేలాది మంది ఆందోళన నిర్వహించారు. వేగంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జైపూర్‌లో శ్యామ్ నగర్ మెట్రో స్టేషన్‌కు సమీపంలో ఉన్న మార్కెట్లు వద్ద కర్ణిసేన మద్దతుదారులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. టైర్లను దగ్ధం చేశారు.

గవర్నర్‌ను కలిసిన సిఎస్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉషా శర్మతో గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా సమావేశం జరిపారు. సుఖ్‌దేవ్ సింగ్ హత్యపై విచారణ కోసం ఎడిజి (క్రైమ్) దినేష్ ఎంఎన్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేశారు. నిందితుల్లో ఒకరు హర్యానాకు, మరొకరు రాజస్థాన్‌కు చెందిన వారని గుర్తించామని, వారి కోసం గాలిస్తున్నామని జైపూర్ పోలీస్ కమిషనర్ బిజు జార్జ్ జోసెఫ్ తెలిపారు. నిందితుల గురించి సమాచారం ఇస్తే రూ. 5 లక్షల నగదు బహుమతి ప్రకటించారు.

ఎస్‌ఐ పోస్టులకు 18,637 మంది అర్హత

- త్వరలో మెరిట్ జాబితా విడుదల
- ఎస్‌ఎల్‌పిఆర్‌బి ఛైర్మన్ అతుల్ సింగ్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌ఐ పోస్టుల భర్తీ కోసం అక్టోబరులో నిర్వహించిన మూడు, నాలుగు పేపర్‌లకు పరీక్షలు రాసిన వారిలో మొత్తం 18,637 మంది అర్హత సాధించారని, త్వరలో మెరిట్ జాబితా విడుదల చేస్తామని రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ అతుల్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎస్‌ఐ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఎస్‌ఐ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌తో మొత్తం 1,73,047 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. వీరికి ఫిబ్రవరి 19న ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించగా, 1,51,288 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రిలిమినరీ పరీక్షలకు హాజరైన వారిలో 57,923 మంది అర్హత సాధించారని తెలిపారు. ఇందులో దేహదారుఢ్య పరీక్షల అనంతరం 31,193 మంది అర్హత సాధించారని, వీరికి అక్టోబరు 14, 15 తేదీల్లో పేపర్ 3, 4 పరీక్షలను నిర్వహించామన్నారు. ఇందులో 18,637 మంది అర్హత సాధించారని, ఇందుకు సంబంధించి పరీక్షల కీని విడుదల చేస్తున్నామని తెలిపారు. 3, 4 పేపర్లను రాసిన అభ్యర్థులంతా ఎస్‌ఎల్‌పిఆర్‌బి వెబ్‌సైట్‌లో ఫలితాలకు సంబంధించి కీని చూసుకోవచ్చన్నారు. ఈ వెబ్‌సైట్ ఈ నెల 8 వరకు అందుబాటులో వుంటుందని తెలిపారు. ఎస్‌ఐ పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితాను త్వరలో విడుదల చేస్తామన్నారు.

గిరిజన ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్

- సిఎస్‌కు శంకర్ నాయక్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులకు ఆధార్ కార్డులు, ఓటర్ ఐడి కార్డులు, రేషన్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సచివాలయంలో బుధవారం సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో అనేక మంది గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లు సాధ్యమైనంత త్వరగా నిర్వహించి గిరిజనులకు అన్ని విధాలుగా న్యాయం చేయాలని ఆయన సిఎస్‌ను కోరారు.

అనుమతుల తర్వాతే ఇసుక తవ్వకాలు

- హైకోర్టుకు హామీ ఇచ్చిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి

పర్యావరణ అనుమతులు, ఎన్‌ఒసి లేకుండా రాష్ట్రంలో ఇసుక తవ్వకాలకు అనుమతించబోమని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. ఇసుక తవ్వకాలపై హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఈ హామీ ఇచ్చింది. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ నుంచి పర్యావరణ అనుమతులు, ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథార్టీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఎఐ) నుంచి ఎన్‌ఒసి లేకుండా ఇసుక తవ్వకాలు చేయడం సబబు కాదని హైకోర్టు అభిప్రాయపడింది. పర్యావరణ అనుమతులు, ఎన్‌ఒసి లేనికారణంగా టెండర్లను అప్పగించకుండా ఉత్తర్వులు జారీ చేయాల్సి వస్తుందని చెప్పింది. దీంతో ఎజి ఎస్ శ్రీరామ్ పైవిధంగా ఇచ్చిన హామీని హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం రికార్డుల్లో నమోదు చేసింది. ఇసుక తవ్వకాలపై క్లీన్‌చిట్ ఇవ్వడం లేదని, ఇదే అంశంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విచారణ చేస్తున్నందున ఈ వ్యవహారంపై తాము సమాంతరంగా విచారణ చేయడం సరికాదని అభిప్రాయపడింది. ఎన్‌జిటిలో ఫిర్యాదు చేసిన వ్యక్తే ఇక్కడ పిల్ వేశారని చెప్పింది. ఇసుక తవ్వకాల లీజు గడువు గత మే 2తో ముగిసినా జయప్రకాశ్ పవర్ వెంచర్స్, టర్న్ఫ్ ఎంటర్‌ప్రైజ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నాయంటూ అమరావతి మండలం ధరణికోటకు చెందిన దండా నాగేంద్రకుమార్ పిల్ దాఖలు చేశారు. ఇసుక తవ్వకాల విషయం గురించి ఎన్‌జిటి దృష్టికి తీసుకెళ్లొచ్చని పిటిషనరుకు చెప్పింది.

భూ కేటాయింపు రద్దు చేయాల్సింది రాష్ట్రమే

- హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖ జిల్లా ఎండాడ గ్రామంలో హయగ్రీవ ఫార్మ్స్, డెవలపర్స్‌కు 12.51 ఎకరాల భూ కేటాయింపు చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉంటే దానిని రద్దు చేయడంపై రాష్ట్రం నిర్ణయం తీసుకోవచ్చునని హైకోర్టు చెప్పింది. జిల్లా కలెక్టరు నిర్ణయం తీసుకునేందుకు ఆస్కారం లేదని చెప్పింది. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నిర్ణయం తీసుకోవాలంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు భూమిని థర్డ్ పార్టీకి కేటాయింపులు చేయకుండా ప్రతివాదిని ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎండాడలోని 92/3 సర్వే నెంబర్‌లో 12.51 ఎకరాలను హయగ్రీవ ఫార్మ్స్, డెవలపర్స్‌కు కేటాయింపును సవాల్ చేస్తూ జనసేన కార్పొరేటర్ పిఎల్‌ఎన్ మూర్తి యాదవ్, టిడిపి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వేర్వేరుగా వేసిన వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ జరిపింది. కలెక్టరు రిపోర్టు, హయగ్రీవ సంస్థ వాదనల మేరకు తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది.

అంతులేని నష్టం

(మొదటిపేజీ తరువాయి)

ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో నీరు ఇంకా నిలిచే ఉంది. కాకినాడ జిల్లాలో మొత్తం 33,340 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు సుమారు పది వేల ఎకరాలో వరి చేలు నేలకొరిగినట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సుమారు 1500 ఎకరాల్లో పనుల మీద ఉన్న పంట నీటిలో నానుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో 8,190 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. 6,115 ఎకరాల్లో వరి పంట పూర్తిగా పాడయింది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 15 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. అనకాపల్లి జిల్లాల్లో 25 వేలకుపైగా ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. చోడవరం పట్టణంలో ద్వారక నగర్, బానే కోనేరు, కోర్టు సముదాయాల్లోకి నీరు చేరింది. కశింకోట మండలంలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కె.కోటపాడు మండలంలో మల్లంపాలెంకు వెళ్లే దారిలో గెడ్డపై వేసిన తాత్కాలిక బ్రిడ్జి కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. విశాఖ నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మూడు ఇళ్లపై మట్టి పెళ్లలు పడిపోవడంతో స్లాబ్‌లపై ఉన్న వాటర్ ట్యాంకులు, ఇతర సామగ్రి ధ్వంసమయ్యాయి.

ఉదారంగా సాయం అందించాలి

- అధికారులకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం
- పొలాల్లో నీటి తరలింపు కీలకం
- 80 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

వరద ప్రాంతాల్లో బాధితులను ఉదారంగా ఆదుకోవాలని, పొలాల్లో నీటి తరలింపు అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. మిచౌంగ్ తుపాను అనంతరం పరిస్థితులపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం తుపాను ప్రభావిత ప్రాంతాల కలెక్టర్లు, ఎస్‌పిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. అధికారులందరూ ఆయా ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకురావడంపై దృష్టి పెట్టాలని అన్నారు. బాధితుల పట్ల ఉదారంగా, సానుభూతితో వ్యవహరించాలని, మంచి సాయం అందించాలని సూచించారు. వర్షాల వల్ల ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.10 వేలు సాయం ఇచ్చే విషయంలోనూ, ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల వారిని క్యాంపులకు తీసుకొచ్చి వారిని జాగ్రత్తగా చూసుకోవడంలోనూ, క్యాంపుల నుండి తిరిగి ఇళ్లకు వెళుతున్న సమయంలోనూ వారికి ఇవ్వాల్సిన సాయం అందించాలని తెలిపారు. రేషన్ పంపిణీలో ఎలాంటి లోపమూ ఉండకూడదని స్పష్టం చేశారు. పొలాల్లో నీటి తరలింపునకు అవసరమైన అన్ని రకాల పరికరాలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రతి ఆర్‌బికెకు ఎస్‌ఒపి జారీచేశారని, రైతుకు కచ్చితమైన భరోసా ఇవ్వాలని తెలిపారు. పంటల రక్షణ, పరిహారం అందించడం, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం దగ్గర నుండి అన్ని రకాలుగా రైతుకు ప్రతి అడుగులోనూ తోడుగా ప్రభుత్వం ఉంటుందని పేర్కొన్నారు. 88 శాతం సబ్సిడీపై విత్తనాల సరఫరాకు అన్ని రకాలుగానూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పనులు చేపట్టాలని పేర్కొన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపైనా దృష్టి పెట్టాలని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.30 లక్షలు సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో ఉన్న వలంటీర్ దగ్గర నుండి సచివాలయ సిబ్బంది మొదలుకుని ప్రభుత్వంలో పైస్థాయిలో ఉద్యోగి వరకు ఎలాంటి ఇబ్బంది జరిగినా ప్రభుత్వం అన్ని రకాలుగా తోడుగా ఉంటుందని పేర్కొన్నారు. వారిలో ఆత్మస్థైర్యం నింపే పని ప్రభుత్వం చేస్తుందని వివరించారు.

అంబేద్కర్ సేవలు నిరుపమానం

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సేవలు నిరుపమానమని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి సిఎం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ పేదలకు అంబేద్కర్ అందించిన సేవలు నిరుపమానమని అన్నారు. ఆయన అడుగుజాడల్లో వైసిపి ప్రభుత్వం నడుస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు ట్వీట్ కూడా చేశారు. నివాళి కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, మేరుగ నాగార్జున, ఎంపి నందిగం సురేష్, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గగుడికి సిఎం జగన్ - అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విజయవాడలోని దుర్గగుడికి రానున్నారు. తాడేపల్లిలోని నివాసం నుంచి ఉదయం 8:35 గంటలకు బయలుదేరి దుర్గగుడికి చేరుకుంటారు. దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, భూమిపూజ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం కనకదుర్గమ్మను దర్శించుకుంటారు. ఆ తర్వాత తాడేపల్లికి చేరుకుంటారని సిఎంఒ కార్యాలయం పేర్కొంది.

శరవేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్
- 37కోట్ల నష్టం జరిగిందని అధికారులు అంచనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. తుపాన్ ప్రాంతాల్లోని విద్యుత్ పునరుద్ధరణ పనులు, సరఫరాపై ట్రాన్స్‌కో, డిస్కంల అధికారులతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణా, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సాధారణ స్థితికి తీసుకురావడంలో విద్యుత్ సంస్థలు విజయవంతమయ్యాయన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను పూర్తిచేసి వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సరఫరా సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు నిరంతరం పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. చెందోడులోని 132కెవి సబ్‌స్టేషన్ మరమ్మత్తులు పూర్తిచేసి విద్యుత్ పునరుద్ధరణ చేశామని ట్రాన్స్‌కో అధికారులు విజయానంద్‌కు వివరించారు. మొత్తం 17 ఫీడర్లు దెబ్బతిన్నాయని, వీటిల్లో 10 ఫీడర్లను పునరుద్ధరణ చేశామని తెలిపారు. . తుపాన్ వల్ల విద్యుత్ సంస్థలకు రూ.37కోట్ల నష్టం జరిగిందని మూడు డిస్కంల సిఎండిలు అంచనా వేశారు. ఎపిసిపిడిసిఎల్ సిఎండి కె సంతోషరావు మాట్లాడుతూ నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాలో 1132 గ్రామాలు, 46 మండలాలు, 7 పట్టణాల్లో మరమ్మత్తుల పనులు పూర్తయ్యాయని చెప్పారు. మొత్తం 231 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, రూ.1235.45లక్షల నష్టం జరిగిందని తెలిపారు. నెల్లూరులో 33/11 కెవి సబ్‌స్టేషన్లు 36 పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. ఇపిడిసిఎల్ సిఎండి ఐ పృథ్వీతేజ్ మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు ప్రాంతాల పరిధిలో 1110 గ్రామాలు, 77 మండలాల్లో పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం 395 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, రూ.545.98లక్షల నష్టం తుపాన్ వల్ల జరిగిందని వివరించారు. ఎపిసిపిడిసిఎల్ సిఎండి పద్మజనార్దన్ రెడ్డి మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు, ప్రకాశం, ఒంగోలు పరిధిలో 1707 గ్రామాలు, 109 మండలాలు, 11 పట్టణాల్లో పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. 81 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, రూ.1995.57లక్షల నష్టం జరిగిందని వివరించారు.

రైతులను ఆదుకోవాలి

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిచౌంగ్ తుపాను తీవ్రతతో రాష్ట్రంలోని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, వారిని మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు సమాచారం అందుతోందని, ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి, విజయనగరం జిల్లాల్లో వరి సాగుచేసిన రైతులు సర్వం కోల్పోయారన్నారు. పొలాల్లో ఉన్న పంట తడిచిపోయిందని, వర్షాలతో అదనంగా ఎకరాకు రూ.10 వేలు ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాల్లో ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, అరటి, బొప్పాయి చెట్లు నేలకొరిగాయని, వీటితో పాటు పొగాకు, మినప, శెనగ, మిర్చి పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. పంట నష్టాన్ని గణించడంలో వాస్తవికతను ప్రతిబింబించాలని, కరువు మండలాలను గుర్తించే విషయంలో తూతూమంత్రంగా లెక్కలు వేస్తే రైతులకు అన్యాయం చేయడమే అవుతుందని అన్నారు. ప్రభుత్వం రైతులకు పంటల బీమా విషయంలోనూ నిర్లక్ష్యం వహించిందని, ఇందుకు బాధ్యత వహించి పూర్తి నష్టాన్ని ప్రభుత్వమే భర్తీ చేయాలని పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు.

సమస్యలను పరిష్కరించకపోతే

రేపటి నుంచి సమ్మె

- సిఎస్‌తో అంగన్‌వాడీ వర్కర్స్ సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



సిఎస్ జవహర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న సుబ్బరావమ్మ, చిత్రంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎవి నాగేశ్వరరావు తదితరులు

సమస్యలు పరిష్కరించకపోతే రేపటినుండి (8వ తేది) సమ్మె లోకి వెడతామని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలిపాయి. సిఐటియు అనుబంధ సంఘం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఎఐటియుసి అనుబంధ సంఘం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్, ఐఎఫ్‌టియు అనుబంధ సంఘం ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ల నాయకులు బుధవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాడ్యూటీని అమలు చేయడంతోపాటు అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్‌రావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్ సుప్రజ, నాయకులు టి గజలక్ష్మిని సిఎస్‌ను కలిసిన వారిలో వున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్‌రావు, కె సుబ్బరావమ్మ అంగన్‌వాడీల క్షేత్ర స్థాయి సమస్యలను సిఎస్‌కు వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లు, మిని వర్కర్లు, హెల్పర్లకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఇపుడు ఇస్తున్న గౌరవ వేతనం ఏ మాత్రం సరిపోవడం లేదని తెలిపారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణాలో కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ వేతనం ఇస్తానన్న ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు గ్రాట్యుటిని అమలు చేయాలని సుప్రీం కోర్టు చెప్పినా ప్రభుత్వాలు అమలు చేయడం లేదని అన్నారు. రిటైర్ అయ్యాక అంగన్‌వాడీలు దుర్భర జీవితం గడుపుతున్నారని తక్షణం గ్రాట్యుటిని అమలు చేయాలని కోరారు. రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచి, బెనిఫిట్స్‌ను రూ.5 లక్షలకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50శాతం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. 48 ఏళ్ల సర్వీసు తర్వాత మృతి చెందినా కనీసం మట్టిఖర్చులకు కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలన్నింటినీ అంగన్‌వాడీలకు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్‌లు పనిచెయ్యడం లేదని వివరించారు. యాప్‌ల నిర్వహణ పేరుతో జరుగుతున్న వేధింపులను ఆపాలని కోరారు. పదోన్నతులలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని కోరారు. పెండింగ్‌లో వున్న అద్దెలు, టిఎ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఎస్ యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు. ఆర్థికపరమైన అంశాలను పరిశీలిస్తామని తెలిపారు.



కెకె లైన్‌లో మంటలు

ప్రజాశక్తి - అనంతగిరి(అల్లూరి జిల్లా)

అనంతగిరి మండలం శివలింగాపురం, టైడా మార్గమధ్యంలో కెకె.లైన్‌లో గూడ్స్ రైలు వెళుతున్న సమయంలో విద్యుత్ కేబుల్ లైన్‌పై చెట్టు విరిగిపడి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గూడ్స్ పైలట్ గమనించి రైలును నిలుపుదల చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టును తొలగించి, విద్యుత్ లైన్ పునరుద్ధరణ చేసి గూడ్స్‌ను పోనిచ్చారు.

ఇండియా బ్లాక్ పార్లమెంటరీ నేతల భేటీ

- కీలకమైన బిల్లులు, పార్లమెంట్ వ్యూహంపై చర్చ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపైన, కీలక బిల్లులపైన ఇండియా బ్లాక్ పార్లమెంటరీ పార్టీ నాయకులు చర్చించారు. బుధవారం రాత్రి కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఇండియా బ్లాక్ పార్లమెంటరీ నాయకులు సమావేశం జరిగింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్, అదిర్ రంజన్ చౌదరి, కె. సురేష్, (కాంగ్రెస్), లలన్ సింగ్ (జెడియు), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పి), టిఆర్ బాలు (డిఎంకె), వందనా చౌహాన్ (ఎన్‌సిపి), ఎలమరం కరీం (సిపిఎం), బినయ్ విశ్వం (సిపిఐ), రాఘవ్ చద్దా (ఆప్), మహువా మాంఝీ (జెఎంఎం), ఎన్ కె ప్రేమ్ చంద్రన్ (ఆర్‌ఎస్‌పి), ఈటీ మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), జోషి కె. మణి (కేరళ కాంగ్రెస్)తో పాటు ఆర్‌జెడి, నేషనల్ కాన్ఫరెన్స్, ఎండిఎంకె, విసికె తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు. టిఎంసి, శివసేన (ఠాక్రే) పార్టీలు సమావేశానికి హాజరు కాలేదు. అనంతరం సిపిఎం పార్లమెంటరీ పార్టీ నేత ఎలమరం కరీం మాట్లాడుతూ "ప్రభుత్వం మూడు ముఖ్యమైన బిల్లులను ప్రవేశపెడుతుంది. అది క్రిమినల్ చట్ట సవరణలు, భారతీయ శిక్షాస్మృతి, భారతీయ సాక్ష్యాధారాల చట్టం, ఇది చాలా ముఖ్యమైన చట్టం. కాబట్టి మేము ఏకరీతిగా నిలబడాలి. అది ఈ సమావేశంలో చర్చించాం" అని తెలిపారు. ఎన్.కె ప్రేమచంద్రన్ మాట్లాడుతూ "రాజ్యసభ, లోక్‌సభ రెండింటిలోని ఫ్లోర్ లీడర్‌ల రెగ్యులర్‌గా జరిగే సాధారణ సమావేశం. మేము పార్లమెంట్ సమావేశానికి సంబంధించి ఫ్లోర్ కోఆర్డినేషన్ గురించి చర్చించాము. భాగస్వామ్య పక్షాల్లో ఎవరి మధ్యా అభిప్రాయ భేదాలు లేవు. ప్రతిపక్షాలన్నీ ఒక్కటయ్యాయి" అని అన్నారు. కాంగ్రెస్ ఎంపి కె సురేష్ మాట్లాడుతూ "మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో ఫలవంతమైన సమావేశం జరిగింది. దాదాపు అన్ని ఇండియా గ్రూప్ భాగస్వాములు, ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. వివరంగా చర్చించాం...పార్లమెంట్‌లో ఐపిసి, సిఆర్‌పిసి, సిపిసి సవరణ బిల్లు వస్తోంది. ఎన్నికల కమిషన్ అపాయింట్‌మెంట్ సవరణ బిల్లు కూడా వస్తోంది. కాబట్టి, కొన్ని ముఖ్యమైన బిల్లులు రాబోతున్నాయి. మేము ఏ స్టాండ్ తీసుకోవాలో వివరంగా చర్చించాము" అని తెలిపారు. ఐయుఎంఎల్ ఎంపి ఈటి మహ్మద్ బషీర్ మాట్లాడుతూ ఇండియా గ్రూప్ అనుసరించాల్సిన వ్యూహం గురించి చర్చించామని, ఇండియా గ్రూప్‌ను బలోపేతం చేయడం గురించి కూడా చర్చించామని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్ మాట్లాడుతూ ' త్వరలో ఇండియా గ్రూప్ నేతల సమావేశం ఉంటుందని, ఒకటి లేదా రెండు రోజుల్లో సమావేశం తేదీని ప్రకటిస్తామని అన్నారు.



రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న బిజెపి

- అంబేద్కర్‌కు నివాళిలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి భూస్థాపితం చేయాలని చూస్తోందని, పౌర, ప్రాథమిక హక్కులను రద్దుచేసి నిరంకుశ పద్ధతిలో పాలన చేసేందుకు ప్రయత్నిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ సామాజిక న్యాయం కోసం జీవితాన్ని త్యాగం చేశారని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మనువాద మనుధర్మ సిద్ధాంతంతో అగ్రకుల దురహంకారాన్ని ఇతర కులాల మీద రుద్దడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంతో సహా అనేక రాష్ట్రాల్లో దళితులు, ఆదివాసీలు, మహిళల మీద దాడులు అమానుషంగా పెరుగుతున్నాయన్నారు. రాజ్యాంగం పరిరక్షణ కోసం కులాలు, మతాలకతీతంగా అందరం పూనుకుని ప్రతిజ్ఞ తీసుకోవడమే అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని, పరువు హత్యలు జరుగుతున్నాయని అన్నారు. వారికి రక్షణగా ప్రభుత్వం ఆర్థిక సహాయం, ఉద్యోగం గ్యారెంటీ చేసి అండగా ఉండాలని, వారి రక్షణకు ఒక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె ధనలక్ష్మి, ఎ మాల్యాద్రి, జె జయరాం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవుల కోసం నేతల ప్రయత్నాలు

- డికె శివకుమార్‌ను కలిసిన శ్రీధర్ బాబు, ప్రేమ్‌సాగర్, మల్ రెడ్డి
- ఇకపై అన్నీ అధిష్టానమే చూస్తోందన్న డికె శివకుమార్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి ఎవరన్నది స్పష్టత వచ్చిన నేపథ్యంలో మంత్రి వర్గంలో చోటు కోసం నేతలు ఢిల్లీకి క్యూ కట్టారు. తమకు అవకాశం కల్పించాలని పట్టున్న కీలక నేతల ద్వారా విశ్వ ప్రయత్నాలు మొదలుపెట్టారు. సిఎం పదవి కోసం ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క ఇప్పటికే అగ్రనేతలను కలిసి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. బుధవారం ఢిల్లీలో ఎఐసిసి పరిశీలకుడు డికె శివకుమార్‌ను కాంగ్రెస్ రాష్ట్ర నేతలు శ్రీధర్ బాబు, ప్రేమ్ సాగర్, మల్ రెడ్డి రంగారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ మంత్రివర్గంలో కీలకశాఖ కేటాయించాలని కోరినట్లు తెలిసింది.

డికె శివకుమార్‌తో భేటీ తరువాత శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. పార్టీ ముఖ్య నేతలను కలిసేందుకు ఢిల్లీ వచ్చినట్లు చెప్పారు. అందులో భాగంగా శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశానన్నారు. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. పార్టీలో సీనియర్‌గా ఉన్న తనకు మంత్రి కేటాయించాలని కోరినట్లు ప్రేమ్ సాగర్ వెల్లడించారు. మరోవైపు గడ్డం వినోద్ సైతం తనకు మంత్రి పదవి ఇవ్వాలని, అగ్ర నేతలు సోనియా గాంధీ, కెసి వేణుగోపాల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

నా చేతిలో ఏమీ లేదు..: డికె

తెలంగాణ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికలో హైకమాండ్ తనకు పరిశీలకుడుగా బాధ్యతలు అప్పగించిందని డికె శివకుమార్ అన్నారు. ఆ దిశలో సిఎల్‌పి నిర్ణయాన్ని హైకమాండ్‌కు అందించినట్లు చెప్పారు. ఈ రిపోర్టు ఆధారంగా అధిష్టానం సిఎం ఎంపికపై నిర్ణయం తీసుకుందన్నారు. అధిష్టానానికి అన్ని అంశాలనూ వివరించానని, ఇకపై అన్ని నిర్ణయాలనూ అధిష్టానమే తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇకపై తన చేతిలో ఏమీ లేదని అన్నారు.

జిఎస్‌టి శాఖల మధ్య సమన్వయం అవసరం

- సిజిఎస్‌టి చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర జిఎస్టి, కేంద్ర జిఎస్‌టి శాఖల మధ్య పరస్పర సమన్వయం, సహకారం ఉండాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్(సిబిఐసి) చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్ అన్నారు. కస్టమ్స్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర, కేంద్ర శాఖల మధ్య కో ఆర్డినేషన్ కమిటి సమావేశం సిజిఎస్‌టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. రెండు శాఖల మధ్య సమాచార మార్పిడి, సాంకేతికత అవసరమని సంజయ్ ఈ సందర్భంగా అన్నారు. ఉద్యోగులు వృత్తికి అంకితమై పన్ను చెల్లింపుదారుల సమస్యలు పరిష్కరించి వారికి అందించే సేవలు అమూల్యంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర జిఎస్‌టి కమిషనర్ ఎం గిరిజా శంకర్ మాట్లాడుతూ నకిలీ రిజిస్ట్రేషన్లు, నకిలీ ఇన్‌వాయిస్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిఘా వ్యవస్థను మరింత పటిష్టపరిచామని జిఎస్‌టి ఇంటిలిజెన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎమ్ రామిరెడ్డి అన్నారు. పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర జిఎస్‌టి ప్రత్యేక కమిషనర్ ఎం అభిషేక్ కిషోర్ అన్నారు. రెండు శాఖల కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గా తొలి ఏడాది సిజిఎస్‌టి చీఫ్ కమిషనర్, రెండో ఏడాది ఎస్‌జిఎస్‌టి చీఫ్ కమిషనర్ వ్యవహరిస్తారని కస్టమ్స్ కమిషనర్ చౌదరి చెప్పారు.

టిడిపి అక్రమాలపై చర్యలు తీసుకోండి

- సిఇఒకు వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి నాయకులు అక్రమంగా అనర్హులను ఓటర్లుగా చేర్పిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాకు వైసిపి ఫిర్యాదు చేసింది. బుధవారం రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్, ఎంపి గురుమూర్తి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఈ మేరకు సిఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి నేతలు దొంగ ఓట్లు చేర్పించడంలో సిద్ధహస్తులుగా మారారని విమర్శించారు. ప్రజల మద్దతు లేకపోవడంతో టిడిపి అక్రమ మార్గంలో గెలిచేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 4 లక్షల 30 వేల మందికి రెండు రాష్ట్రాల్లో ఓట్లు వున్నాయని, వాటిని తొలగించాలని కోరారు. చంద్రబాబు చేసిన తప్పులు ఇతరులపైకి నెట్టేందుకే ఢిల్లీకి వెళ్లారని విమర్శించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- ఆప్కాస్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ ప్రభుత్వ శాఖల్లోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు విజ్ఞప్తి చేసింది. ఆప్కాస్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను సిఎస్‌కు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసినట్లు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.5 లక్షల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలకు పనిచేస్తున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా.. ప్రభుత్వాలు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలను కూడా ఇవ్వకుండా పనిచేయించుకుంటున్నాయని తెలిపారు. తక్షణం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ కాంట్రాక్టు పద్ధతిలోకి తీసుకోవాలని కోరారు. అలాగే శానిటేషన్, సెక్యూరిటీ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఆప్కాస్‌లోకి విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. తక్కువ వేతనాలకే పనిచేస్తున్నందున అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు.

చంద్రబాబుతో పవన్‌కల్యాణ్ భేటి

- తాజా రాజకీయాలపై చర్చ

ప్రజాశక్తి, -హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం అధినేత చంద్రబాబుతో జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ బుధవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. బాబు నివాసనంలో తాజా రాజకీయాలపై ఇరువురు చర్చించినట్టు సమాచారం.

టిడిపి-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోపై గత నవంబరు 4న భేటి అయిన సంగతి తెలిసిందే. తరచూ సమావేశమై పొత్తు ప్రక్రియ వేగవంతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని గతంలో ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. అలాగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, ఫలితాలపై కూడా మాట్లాడుకున్నట్టు తెలిసింది. బిఆర్ఎస్‌కు ఊహించనిరీతిలో పరాభవం ఎదురుకావడం, కామారెడ్డిలో కెసిఆర్ ఓడిపోవడం, జనసేన పోటీ, ఫలితాలు తదితర అంశాలపై కూడా చర్చించుకున్నట్టు ఆ పార్టీ శ్రేణులు తెలిపాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలు, బిజెపి పరిస్థితిపై కూడా మాట్లాడుకున్నట్టు సమాచారం. అయితే, ఈ భేటికి సంబంధించిన వివరాల కోసం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సంప్రదించగా, తమకేమీ తెలియదని వివరణ ఇచ్చారు.

ముందస్తు చర్యలు చేపట్టంలో జగన్ విఫలం

- యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మిచౌంగ్ తుపానుపై ముందస్తు చర్యలు చేపట్టడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విఫలమయ్యారని శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపానుపై వారం నుంచే హెచ్చరికలు ఉన్నా అధికార యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేయడంలో సిఎం విఫలమయ్యారని పేర్కొన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ఆహారం, పునరావాసానికి చర్యలు చేపట్టలేదన్నారు.

తూతూమంత్రంగా సమీక్ష చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు రూ.7 వేల కోట్ల విలువైన పంట ఉత్పత్తులను రైతులు కోల్పోయారని తెలిపారు. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

సామర్థ్యం లేదా? సహకారం లేకనా?

- 'ఉక్కు' నష్టాలపై అభూతకల్పనలు
- పది నెలలుగా బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూత పెట్టిన కేంద్రం
- మాంగనీసు నిల్వలపై మౌనం దాల్చిన రాష్ట్రం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ (ఫైల్ ఫొటో)

విశాఖ ఉక్కు కర్మాగారం ఉసురు బలవంతంగా తీసేయ్యాలని కేంద్రంలోని బిజెపి సర్కారు కుట్రలు చేస్తోంది. ఈ కర్మాగారాన్ని నష్టపరిచే చర్యలకు ఒడిగట్టింది. దీంట్లో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యమూ ఉంది. నష్టాల పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. 'ఉక్కు నష్టాలు 2023-24 తొలి ఆర్థిక సంవత్సరంలో రూ.2050 కోట్లు' అంటూ ఈ నెల 3న రాజ్యసభలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్‌సింగ్ కులస్థే చేసిన ప్రకటన తాజాగా కార్మికవర్గంలో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. ఉక్కు కర్మాగారంలో మూడు ఫర్నేస్‌లకుగానూ 25 లక్షల టన్నుల స్టీలు ఉత్పత్తి చేసే ఒక ఫర్నేస్‌ను ఈ ఏడాది జనవరిలో మూసేసింది. సామర్థ్యం ఉంటుండగానే దీని పీకనులిమేసింది. దీంతో, ఉత్పత్తి తగ్గింది. ప్రధాని మోడీ ఇటీవల ఓ ప్రకటన చేస్తూ 2030 నాటికి దేశీయ అవసరాలకు 300 మిలియన్ టన్నులు స్టీల్ కావాలని, ప్రస్తుతం 140 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వెల్లడించారు. కానీ, ఉక్కు ఉత్పత్తి పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను మాత్రం వెల్లడించలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఏటా 25 లక్షల మిలియన్ టన్నులు ఉత్పత్తి చేసే ఫర్నేస్‌ను ఎందుకు ఆపేశారని కేంద్ర స్టీల్ మంత్రిని విశాఖ కార్మిక సంఘాలు ఢిల్లీలో గత మార్చిలో కలిసి వివరణ కోరగా, 'చూస్తాం... మీరెళ్లండి' అంటూ సమాధానపరచారు. ఆ తర్వాత ప్లాంట్‌కు సెక్రటరీలు, కేంద్ర మంత్రులు వచ్చారు... వెళ్లారు తప్ప... ప్లాంట్ ప్రగతికి తీసుకున్న చర్యలు శూన్యం.

కేంద్రానిది బాధ్యత కాదా?

వాస్తవానికి ఉక్కు ఉత్పత్తి అధికంగా వస్తే స్టీల్ ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. మార్కెట్‌లో స్టీల్ టన్ను ఖరీదు రూ.64 వేలు వరకూ ఉంది. స్టీల్‌ప్లాంట్‌లోని ఒక ఫర్నేస్‌లో 25 లక్షల టన్నుల ఉత్పత్తి నిలిచిపోయింది. అదీ పనిచేస్తే రూ.వేల కోట్లు విలువ చేసే స్టీల్ బయటకొస్తుంది. దీనిపై 18 శాతం పన్ను కింద ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.3200 కోట్లు ఆదాయం చేకూరుతుంది. ఈ వాస్తవాలన్నింటినీ పక్కన పెట్టేసి రూ.వేల కోట్లతో సిద్ధం చేసుకున్న యంత్రాలను నిరుపయోగంగా ఉంచడం వల్ల నష్టాలు రావా? అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. 2018-19లో మొత్తం టర్నోవర్‌లో 85 శాతం ఉత్పత్తి రాగా, 2020-2021లో 65 శాతానికి ఇది పడిపోయింది. రూ.3 లక్షల కోట్ల విలువైన ఉక్కు కర్మాగారానికి వర్కింగ్ కేపిటల్ కింద రూ.3 వేల కోట్లును ప్రభుత్వం ఇవ్వకపోవడం దారుణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎపి ప్రభుత్వ భాగస్వామ్యం ఇలా..

విజయనగరం జిల్లాలోని గర్భాం వద్ద మాంగనీసు ఖనిజం రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో ఉంది. 1982 అక్టోబర్‌లో స్టీల్‌ప్లాంట్ కోసం 40 ఏళ్ల లీజుకు ఇచ్చారు. 2022 తరువాత ఆటోమేటిక్‌గా అంటే (డీమ్డ్ టు బి ఎక్స్‌టెండ్) చేసుకోవచ్చు. ఇది రాష్ట్ర ప్రభుత్వమే చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిగా దీనిపై నోరుమెదపడం లేదు. దీంతో, మాంగనీసు లీజు విస్తరణకు నోచుకోవడం లేదు. నాడు రూ.3 వేలుకే టన్ను మాంగనీసు ఓర్ గర్భాం మైనింగ్ నుంచి లభించేది. ఏడాది కాలంగా ఈ మాంగనీసు టన్నును రూ.13 వేలకు స్టీల్‌ప్లాంట్ బయట కొనుక్కుంటోంది.

మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను వెంటనే ప్రారంభించాలి

స్టీల్‌ప్లాంట్‌పై అడుగడుగునా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయి. ప్లాంట్‌కు లాభాలు తెచ్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం విజయనగరం జిల్లా గర్భాం వద్ద మాంగనీసు గనులను పదేళ్లపాటు లీజుకు తక్షణం ఇవ్వాలి. సారిపల్లి ఇసుక మైన్స్‌గానీ, ప్రత్యామ్నాయంగా వేరే మైన్స్‌నుగానీ కేటాయించాలి. దీనిపై రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి వివరించాం.

జె.అయోధ్యరామ్,
ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్

'ఉక్కు రక్షణకై ధూంధాం' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యాద్ కుమార్, చంటి, అప్పారావు

ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28, 29, 30 తేదీల్లో గాజువాకలంక గ్రౌండ్‌లో నిర్వహించనున్న 'ఉక్కు రక్షణకై ధూంధాం' కార్యక్రమ పోస్టర్‌ను విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. పోస్టర్‌ను సినీ డైరెక్టర్ యాద్ కుమార్ ఆవిష్కరించి మాట్లాడుతూ.. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయాలని చూడడం దారుణమన్నారు. ఈ కర్మాగారం పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రజానాట్య మండలి చేపట్టిన ధూం ధాం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి మాట్లాడుతూ.. నాలుగు రోజులపాటు జరిగే ఈ ధూంధాంలో సుమారు వెయ్యి మంది కళాకారులు పాల్గొని, ప్రదర్శనలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఉక్కు రక్షణకు తాము బహుముఖ కార్యక్రమాలు తలపెట్టామని, భవిష్యత్తులో పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామని తెలిపారు. సంఘం జిల్లా నాయకులు వై.అప్పారావు మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యాలు, నాటికలు, కోలాటాలు, తప్పెటగుళ్ళ, చెక్కభజనలు, కూచిపూడి నృత్యాలు, మిమిక్రీ, మ్యాజిక్ షో, స్టేజీ నాటికలు, బృంద గానాలు వంటి కళారూపాలు ప్రదర్శించడానికి వందలాది మంది కళాకారులు తరలిరానున్నారని చెప్పారు. విశాఖలోని కవులు, కళాకారులు, కళా సంస్థలు ధూంధాంకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బడ్జెట్‌పై జాగరూకత

- మేనిఫెస్టోపై ప్రత్యేక శ్రద్ధ
- కార్యదర్శులు, హెచ్‌ఒడిలతో భేటీలో ఆర్థిక శాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై తొలి కసరత్తు భేటీ బుధవారం సచివాలయంలో జరిగింది. అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల నుంచి ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఇతర శాఖల అధిపతులతో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఈ సమావేశం నిర్వహించారు. బడ్జెట్ ఎలా ప్రతిపాదించాలన్న కోణంలో వివరాలు సమర్పించి, శాఖల అధికారుల అనుమానాలను ఆర్థికశాఖ నివృత్తి చేసింది. వార్షిక బడ్జెట్‌పై ఇప్పటికే మార్గదర్శకాలు జారీచేసిన ఆర్థికశాఖ అవసరాలకు తగ్గట్టుగానే బడ్జెట్‌ను ప్రతిపాదించాలని, వృథా వ్యయానికి ఆస్కారం ఇవ్వరాదని ఈ భేటీలో స్పష్టం చేసింది. 2019 ఎన్నికల సమయంలో ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, ఇందుకు అనుగుణంగానే నిధులను ప్రతిపాదించాలని స్పష్టం చేసింది. నవరత్నాలకు కావాల్సిన నిధులపై పూర్తిగా అధ్యయనం చేయాలని పేర్కొంది. తమ శాఖల పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలకు, రహదారులు, నీటిపారుదల పథకాలు, ఇతర నిర్మాణ రంగాలకు కావాల్సిన నిధులపై స్పష్టతతో ప్రతిపాదనలు తయారుచేయాలని నిర్దేశించింది. ఆదాయ వనరుల శాఖలు కూడా ఆదాయంపై స్పష్టంగా ప్రతిపాదనలు తయారుచేయాలని పేర్కొంది. గతేడాది ఎంత ప్రతిపాదిస్తే ఎంత ఆదాయం వచ్చింది అన్నది అధ్యయనం చేసి, కొత్త సంవత్సరంలో ఆదాయాన్ని ప్రతిపాదించాలని ఆర్థికశాఖ సూచించింది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తమ ఆదాయంలో చూపించాలని పేర్కొంది. గతేడాది రావాల్సిన ఆదాయం బకాయిలను కూడా ఈసారి వసూలు చేయాలని, వాటిని కూడా ఆదాయంగా చూపించాలని సూచించింది. తాజాగా బడ్జెట్‌లో పిల్లల, జెండర్ బడ్జెట్‌కు నిధులు కేటాయించనున్న నేపథ్యంలో వాటికి కూడా ప్రతిపాదించాలని ఆర్థికశాఖ పేర్కొంది.

ఎపి భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాల్సిందే..

- న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్, టెక్కలి



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎపి భూహక్కుల చట్టం-23ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. శ్రీకాకుళం జిల్లా కోర్టు, టెక్కలి కోర్టుల ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సూర్యారావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌లో పొందుపరిచిన సెక్షన్ 37, 38, కొన్ని ప్రావిజన్లలో పేర్కొన్న అంశాలు ప్రజలకు, న్యాయవాదులకు గొడ్డలిపెట్టు వంటిదన్నారు. సివిల్ కోర్టుల పరిధి నుంచి పూర్తిగా లిటిగేషన్‌ను తప్పించి, ప్రభుత్వమే ఒక ప్రత్యేక అధికారిని నియమించి లిటిగెంట్ పబ్లిక్ ఆస్తిపై హక్కులను పరిష్కరించి తీర్పు వెలువరించే అధికారం ఇచ్చిందన్నారు. ఆ అధికారి ఇచ్చే తీర్పుపై స్థానిక సివిల్ కోర్టులకు కాకుండా హైకోర్టుకు మాత్రమే అధికారం ఉంటుందని తెలిపారు. దీనివల్ల న్యాయవాదుల భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యులకు న్యాయం దూరమవుతుందని తెలిపారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌పై ఈ నెల ఎనిమిదో తేదీ వరకు న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాము, ఎం.భవానీ ప్రసాద్, బార్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు జి.వాసుదేవ రావు, శిష్టు రమేష్, ఎపి బిసి అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎ.ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.వివేకానంద, బెండి గౌరీపతి, పేడాడ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

9, 10న యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

యుటిఎఫ్ రాష్ట్ర 49వ కౌన్సిల్ సమావేశాలు ఏలూరు మినీబైపాస్ రోడ్డులోని చలసాని గార్డెన్స్‌లో ఈనెల 9,10 తేదీల్లో నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, పాత పెన్షన్ విధానం సాధనకు రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో 'అదనంగా గంట విద్యార్థుల కోసం' ఉపాధ్యాయులు కేటాయించాలనే నినాదాన్ని కూడా తీసుకోబోతున్నామన్నారు. సమావేశాల తొలిరోజు ఉదయం స్థానిక కెనాల్ రోడ్డులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి చలసాని గార్డెన్ వరకూ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఈ సభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, ఏలూరు కార్పొరేషన్ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, విద్యా శ్రేయోభిలాషి ఎస్ఎంఆర్ పెదబాబు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం హాజరవుతుందని తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు

- అంబేద్కర్ విగ్రహాలకు అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి - యంత్రాంగం



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

తమకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం డిమాండ్ చేస్తూ బుధవారం పలు జిల్లాల్లో అంబేద్కర్ విగ్రహాలకు అంగన్‌వాడీలు వినతిపత్రాలు అందజేశారు. ఎపి అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. తమ పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోన్న వైసిపి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ నెల ఎనిమిది నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు పలువురు నాయకులు తెలిపారు.

విజయవాడ స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ... అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వానికి అనేక మార్లు విజ్ఞప్తి చేసినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈనెల ఎనిమిది నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నట్లు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంబేద్కర్ విగ్రహాలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఏలూరు జిల్లా చింతలపూడి పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళంలోని అంబేద్కర్ కూడలిలో నిరసన తెలిపారు.

అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. విశాఖ ఎల్ఐసి కార్యాలయం దరి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట, కరపలో అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, బొండాయికోడు తూము సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలంలోని కామరాజుపేటలో, కడప, మైదుకూరులో మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేసి,నిరసన తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం, నందిగామ, తిరువూరులో వినతిపత్రాలు అందజేశారు. కర్నూలు జిల్లా కోసిగి, ఆదోనిలో, నంద్యాల జిల్లాలో డోన్, చాగలమర్రి, ఆత్మకూరు, కొత్తపల్లి, నంద్యాలలో అంబేద్కర్ విగ్రహాలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అంగన్‌వాడీలు అందజేశారు.

నవంబర్‌లో 28.54 లక్షల వాహన అమ్మకాలు

న్యూఢిల్లీ : పండగ సీజన్‌లో రికార్డ్ వాహన అమ్మకాలు నమోదయ్యాయి. ప్రస్తుత ఏడాది నవంబర్‌లో మొత్తంగా 18.45 శాతం వృద్ధితో 28,54,242 యూనిట్ల విక్రయాలు జరిగాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) బుధవారం తెలిపింది. ప్యాసెంజర్ వెహికల్స్, ద్విచక్ర వాహన విక్రయాలు భారీగా పుంజుకోవడంతో రికార్డ్ అమ్మకాలు చోటు చేసుకున్నాయని తెలిపింది. 2022 నవంబర్‌లో 24,09,535 యూనిట్ల అమ్మకాలు జరిగాయని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలు పుంజుకోవడం, కొత్త మోడళ్ల అందుబాటులోకి రావటంతో ద్విచక్ర వాహన అమ్మకాలు పెరిగినట్లు వెల్లడించింది. ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన నవంబర్‌లో ద్విచక్ర వాహన విక్రయాలు 21 శాతం పెరిగి 22,47,366 యూనిట్లుగా నమోదయ్యాయి.

21వేల చేరువలో నిఫ్టీ

- మూడో రోజూ లాభాలు

ముంబయి : వరుసగా ఏడో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు రాణించాయి. బుధవారం సెషన్‌లోనూ పెరిగి నూతన రికార్డ్‌లను చేరాయి. ఐటి, ఇంధన రంగ షేర్ల ప్రధాన మద్దతుతో బిఎస్ఇ సెన్సెక్స్ 358 పాయింట్లు పెరిగి 69,654 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 82.60 పాయింట్లు లాభపడి 20,938కి చేరింది. ఇంట్రాడేలో 20,962 వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్-30 సూచీలో విప్రో, ఐటిసి, ఎల్అండ్‌టి, టిసిఎస్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం, రిలయన్స్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఎన్‌టిపిసి, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, మారుతీ, భారతీ ఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ఐఐఎఫ్ఎల్ సమస్తా బాండ్లపై 10.50% వడ్డీ



హైదరాబాద్ : బ్యాంకింగేతర విత్త సంస్థ, మైక్రోఫైనాన్స్ కంపెనీ ఐఐఎఫ్ఎల్ సమస్తా రూ.1,000 కోట్ల నిధులను సమీకరించనున్నట్లు ఆ సంస్థ ట్రెజరీ హెడ్ మోహన్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇందుకోసం తమ సంస్థ జారీ చేయనున్న నాన్ కన్వర్టెడ్ డిబెంచర్ (ఎన్‌సిడి) సెక్యూర్డ్ బాండ్లపై 10.50 శాతం వడ్డీ రేటు అందించనుందన్నారు. 24, 36, 60 నెలల కాలపరిమితితో కూడిన బాండ్లపై నెలసరి లేదా ఏడాదికి ఒక్క సారి వడ్డీ రేటును పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఇష్యూ డిసెంబర్ 4న ప్రారంభమై.. 15న ముగుస్తుందన్నారు. తమ సంస్థ వ్యవసాయ కార్మికులు, కూరగాయలు, పూలు అమ్మేవారు, టైలర్లతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కార్మికుల కోసం తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వనున్నామన్నారు.

పిపిఎస్ మోటార్స్‌తో స్కానియా ఇండియా జట్టు

హైదరాబాద్ : పిపిఎస్ మోటార్స్‌తో ప్రత్యేక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు స్కానియా కమర్షియల్ వెహికల్స్ ప్రయివేటు లిమిటెడ్ బుధవారం ప్రకటించింది. దీంతో దేశంలోని స్కానియా మైనింగ్ టిప్పర్‌లకు ఏకైక ప్రతినిధిగా వ్యవహరించనున్నట్లు తెలిపింది. ఈ భాగస్వామ్యం ద్వారా తాము మోటార్స్ అమ్మకాలు, సేవా కార్యకలాపాలను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. దేశంలో పిపిఎస్ నెట్‌వర్క్ విస్తరణ, అధునాతన కస్టమర్ మద్దతును అందించనున్నామని స్కానియా కమర్షియల్ వెహికల్స్ ఇండియా ఎండి జోహన్ పి ష్లిటర్ తెలిపారు. భారత్‌లో మైనింగ్ ట్రక్కుల వ్యాపారం కోసం స్కానియాతో తాము ప్రత్యేక పంపిణీదారుగా భాగస్వామ్యం చేసుకోవడం సంతోషంగా ఉందని పిపిఎస్ మోటర్స్ ఎండి రాజీవ్ సంఘ్వీ పేర్కొన్నారు.

భాగస్వామి హత్య

- ఆధారాలు లేకుండా మృతదేహాన్ని తగలబెట్టిన వైనం
- నిందితుడితో పాటు 11 మంది అరెస్టు : ఎస్‌పి

ప్రజాశక్తి - అనంతపురం క్రైం



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

ఇద్దరూ కలిసి చేసిన వ్యాపారంలో వచ్చిన నష్టాల నుంచి గట్టెక్కేందుకు మిత్రుడునే హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని అదృశ్యం చేసేందుకు పెట్రోల్‌పోసి తగులబెట్టాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసి, ఛేదించారు. నిందితుడితో పాటు 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం ఎస్‌పి అన్బురాజన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నిందితుడు షేక్ మహమ్మద్ రఫీ, హత్యకు గురైన మహమ్మద్ అలీ ఇద్దరూ స్నేహితులు. రియల్ ఎస్టేట్‌తో పాటు పలు వ్యాపారాలు కలిసి చేసేవారు. వ్యాపారంలో నష్టాలు వచ్చాయి. నష్టపోయిన డబ్బును చెల్లించాలని రఫీని తరుచూ అలీ అడిగేవాడు. దీంతో అలీని చంపేస్తే అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని రఫీ భావించాడు. ధర్మవరం సుఫారీ గ్యాంగ్‌ను సంప్రదించి కుట్ర పన్నాడు. అందులో భాగంగా గతనెల 27న మహమ్మద్ అలీని తన బావ అయిన షేక్ సిద్ధిక్ అలీకి చెందిన ఫర్నీచర్ గోడౌన్‌కు రఫీ పిలిపించాడు. అక్కడ అలీపై దాడి చేసి హతమార్చారు. మృతదేహాన్ని కారులో తీసికెళ్లి గిద్దలూరు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో పడేయాలని తొలుత భావించాడు. అలా చేయడం వీలుకాకపోవడంతో తిరిగి మృతదేహాన్ని అంబులెన్స్‌లో అనంతపురంలోని నారాయణపురం ఇందిరమ్మ కాలనీలో మహమ్మద్ రఫీక్ నిర్మిస్తున్న కొత్త ఇంటికి తీసుకెళ్లారు. గత నెల 28న అర్ధరాత్రి నారాయణపురం సమీపంలోని శ్మశాన వాటికకు మృతదేహాన్ని తీసికెళ్లి పెట్రోలు పోసి కాల్చివేశాడు. బెంగళూరుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని మృతుని తండ్రి ఈ నెల ఒకటిన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో వాస్తవాలు వెల్లడి కావడంతో ప్రధాన నిందితుడితో పాటు హత్యకు సహకరించిన 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

'రెవిన్యూ'రిటైల్ పెట్రోలియం అవుట్‌లెట్‌లు

- స్థలాలను గుర్తించే పనిలో ఉద్యోగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎక్కడికక్కడే ఆదాయాన్ని సమకూర్చుకోవాలని రెవిన్యూశాఖ భావిస్తోంది. పై స్థాయి నుండి అందిన ఆదేశాల మేరకు ఈ దిశలో కసరత్తు జరుగుతోందని సమాచారం. ఇందులో భాగంగా కమర్షియల్ అవసరాలకు ఉపయోగపడే ప్రభుత్వ స్థలాలను జిల్లా కేంద్రాల్లో గుర్తించాలని ఇప్పటికే ఆదేశాలు వెళ్లాయి. గుర్తింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆయా స్థలాల్లో రెవిన్యూశాఖ ఆధ్వర్యంలో పెట్రోలియం అవుట్ లెట్‌లు నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇదే తరహాలో ఇప్పటికే పోలీస్ శాఖ పెట్రోల్ బంక్‌లు నడుపుతోంది. అమ్మకాల ద్వారా వచ్చిన కమిషన్‌ను పోలీస్‌శాఖ సంక్షేమానికి ఉపయోగిస్తోంది. దీంతో ఆ శాఖకు స్థానికంగానే నిధులు సమకూరుతున్నాయి. అదే తరహాలో జిల్లా కేంద్రాల్లో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తొలుత రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన అనంతరం నియోజకవర్గ కేంద్రాల్లో పెట్రోలియం అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగానే ఆదాయం సమకూర్చుకోవచ్చని రెవిన్యూశాఖ అంచనా వేస్తోంది. జిల్లా కేంద్రమైన కడపలో రెవిన్యూవెల్ఫేర్ ఫిల్లింగ్ స్టేషన్ పేరుతో ఇప్పటికే పెట్రోలియం అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. ఇదే విధంగా రాష్ట్రమంతా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

ఇంటర్ ఫీజు గడువు మరోసారి పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్ పరీక్ష ఫీజు గడువును ఇంటర్మీడియట్ బోర్డు మరోసారి పొడిగించింది. మంగళవారంతో ముగిసిన గడువును ఈ నెల 11 వరకు పొడిగిస్తున్నట్లు బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులను జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ బోర్డు ఖాతాలోకి ఈ నెల 12లోపు బదిలీ చేయాలని పేర్కొన్నారు. రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 29 వరకు విద్యార్థులు చెల్లించాలని, ప్రిన్సిపల్స్ 30వ తేదీలోపు ఖాతాలో జమ చేయాలని వెల్లడించారు. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్, వొకేషనల్ రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు ఈ ఫీజులు చెల్లించాలని తెలిపారు.

అధికార యంత్రాంగాన్ని గాడిలో పెట్టండి

- గవర్నరుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దారి తప్పిన అధికార యంత్రాంగాన్ని గాడిలో పెట్టాలని, జరుగుతున్న పొరపాట్లను సరిదిద్ది, ఇకముందు తప్పులు పునరావృతం కాకుండా దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గవర్నరుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ విజ్ఞప్తి చేసింది.

బుధవారం రాజ్‌భవన్‌లో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి, మాజీ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్, సహాయ కార్యదర్శి వి లక్ష్మణరెడ్డి, కార్యవర్గ సభ్యులు, విజయవాడ మాజీ మేయరు జంధ్యాల శంకర్, నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ రంగయ్య, విద్యావేత్త ఎంసి దాస్, ఐజెయు జాతీయ కార్యదర్శి డి సోమసుందర్‌తోకూడిన సిఎఫ్‌డి ప్రతినిధి బృందం.. గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్‌ను కలిసింది. ఈ సందర్భంగా గవర్నరుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 13న జారీ చేసిన జిఓ నెంబరు 7 ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేసిందని, అసలు ఆ జిఓయే అభ్యంతరకరమైందని పేర్కొన్నారు.

సంపాదకీయం

తుపాను పాఠాలు


రాష్ట్ర ప్రజలను భయోత్పాతంలో ముంచెత్తిన మిచౌంగ్ తుపాను తీరం తాకి బలహీనపడినా మూడు రోజుల పాటు కోస్తా జిల్లాలతో పాటు, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో తీవ్ర నష్టం కలిగించింది. ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంది. అయినప్పటికీ, కొందరు మృత్యువాత పడ్డట్లు వార్తలు వచ్చాయి. అయితే, బుధవారం నాటికి కూడా అధికారిక సమాచారంలో ఈ మరణాలు చోటుచేసుకోకపోవడం బాధాకరం. ప్రాణనష్టం అంతగా లేకపోవడం కొంత ఊరట కలిగిస్తున్నప్పటికీ, భారీగా జరిగిన పంట నష్టం, ఆస్తి నష్టం కలిచివేస్తున్నాయి. కోతకొచ్చి పంట నీట మునిగిన దృశ్యాలు కోస్తా జిల్లాలో ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. బాపట్ల వద్ద మంగళవారం తీరం దాటే క్రమంలో గంటకు 100 నుండి 120 కి.మీ వేగంతో వీచిన ప్రచండ గాలులతో అనేక చోట్ల చెట్లు, విద్యుత్ స్థంబాలు నేలకూలాయి. గ్రామాలు అంధకారంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాలతో అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు మరింతగా దెబ్బతిన్నాయి. ఈ లెక్కలన్నీ తేలితే కానీ, వాస్తవంగా జరిగిన నష్టం ఎంతన్నది స్పష్టం కాదు.

లక్షలాది ఎకరాల వరిపంట నీట మునిగింది. కొన్ని చోట్ల కోసి పొలాల్లో వేసిన ఓదేలు నీళ్లలో తేలుతూ కనపడుతున్నాయి. కళ్లాల్లో పోసిన ధాన్యం కూడా తడిసిముద్దయింది. తుపాన్ తీరం దాటిన బాపట్ల జిల్లాలోనే దాదాపు 2 లక్షల ఎకరాల దాకా వరిపంట నీటమునిగినట్టు ప్రాథమిక సమాచారం. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో కూడా కొంచెం అటుఇటుగా ఆ స్థాయిలోనే నష్టం జరిగినట్టు చెబుతున్నారు. నెల్లూరు,తిరుపతి జిల్లాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో కూడా కూడా వరిపంట నీట మునిగింది. వేల రూపాయల పెట్టబడితో పాటు, ఆరుగాలం పడ్డ కష్టం నీళ్ల పాలు కావడం రైతాంగం గుండెలు బాదుకుంటోంది. మిర్చి, పొగాకు, వేరుశనగ, పసుపు తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నానా కష్టాలు పడి పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బొప్పాయి, అరటి వంటి పండ్ల తోటలు సాగుచేసిన వారి దుస్థితి కూడా ఇంతే!

కొన్ని చోట్ల సహాయశిబిరాల్లో భోజన ఏర్పాట్లు కూడా లేవంటూ వార్తలు రావడం బాధాకరం. భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలి. ప్రకృతి విపత్తు కారణంగా సర్వస్వాన్ని కోల్పోయిన బాధితులకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం అండగా నిలవాలి. నష్టాలకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి. ఈ లోగా బాధితులకు తక్షణ సాయం అందించాలి. రైతుల వద్ద ధాన్యం ఏ స్థితిలో ఉన్నా భేషరతుగా కొనుగోలు చేయాలి. తేమశాతం ఎక్కువగా ఉందనో, ఇతర నాణ్యత ప్రమాణాల పేరు చెప్పో మీనమేషాలు లెక్కించకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలి. లెక్కలు తేలిన తరువాత పూర్తిస్థాయి పరిహారం అందచేయాలి. హుదూద్ తుపాన్ సందర్భంగా ప్రకటించిన సాయం కూడాకూడా అరకొరగానే అందిందంటే రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పటికైనా కేంద్రం ఈ వైఖరి వీడాలి. లేని పక్షంలో ప్రతిపక్షాలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడాలి.

మన రాష్ట్రానికి తుపాన్లు కొత్త కాదు. ప్రతి సంవత్సరం దాదాపుగా ఈ విపత్తుల బారిన పడుతూనే ఉంటాం. రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 1970 నుండి ఇప్పటి వరకు దాదాపు 60కి పైగా తుపాన్లు రాష్ట్రంపై ప్రభావం చూపాయి. వీటిలో తీవ్ర, అతితీవ్ర తుపాన్లు 35కు పైనే ఉన్నాయి. ఏడు తీవ్ర, అతి తీవ్ర తుపాన్లు రాష్ట్రంలోనే తీరం దాటాయి. తీర ప్రాంత జిల్లాల్లో దాదాపుగా 3.50కోట్ల జనాభా రాష్ట్రంలో నివసిస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రానున్న సంవత్సరాల్లో ప్రకృతి వైపరీత్యాల ముప్పు మరింతగా పెరగనుంది. కోస్తా జిల్లాలో ముఖ్యంగా కృష్ణా, గోదావరి డెల్టాలో తొందరగా ఖరీఫ్ వరినాట్లు వేసేలా నీటియాజమాన్య చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత. ఇందులో రాజకీయ ప్రయోజనాలు, లేదా వ్యక్తిగత ప్రతిష్టలకు పోవడం గాకుండా రైతు ప్రయాజనాలను పరమావధిగా ప్రభుత్వం భావించాలి. తాత్కాలిక చర్యలతో పాటు, మడ అడవులను కాపాడటం, పెంచడం వంటి దీర్ఘకాల చర్యలు తీసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ శాఖను పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలి.

మహనీయుల మాట



ఎవరినైనా ఓడించాలంటే
చాలా సులభం
కానీ ఎవరినైనా
గెలిపించాలంటేనే చాలా కష్టం
- అబ్దుల్ కలాం

మెరుగ్గా 'ఆడుదాం ఆంధ్ర'

సందర్భం



జి. రామన్న

"ఆడుదాం-ఆంధ్ర" దేశంలోనే అతిపెద్ద మెగాటోర్నీగా చరిత్రలో నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. యువతను క్రీడలవైపు ప్రోత్సహించడం, ఆరోగ్యకరమైన సమాజం వైపు నడిపించడంపై ఎవరికీ అభ్యంతరం ఉండదు. ప్రపంచీకరణ యుగంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రగతి సాధించాము. దాంతో పాటు అంతే స్థాయిలో అసమానతలూ పెరిగాయి. ఇప్పుడున్న యువతరం ఆటలు అంటే మొబైల్ ఫోన్‌లో ఆటలే అనే పరిస్థితి ఏర్పడింది. పోటీ ప్రపంచంలో మెజారిటీ విద్యార్థులకు, యువతకు ఆటలు దూరమై చాలా కాలం అవుతుంది. అంతేకాక డ్రగ్స్‌కు, ఇతర చెడు అలవాట్లకు యువత బలి అవుతుంది. ఈ నేపథ్యంలో అంతరించిపోతున్న గ్రామీణ, సంప్రదాయ క్రీడలను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా ఉండాలి. ఇవి గెలుపు కోసమో లేదా ప్రైజ్ మనీ కోసం మాత్రమే కాదు. మనుషుల మధ్య ఐక్యతకు దోహదం చేస్తాయి. శారీరక మానసిక ఉల్లాసం, ఉత్సాహంతో పాటు ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. ముఖ్యంగా దేహదారుఢ్యం పెంచుతుంది. ఆరోగ్యకరంగా ఉండడానికి ఎంతో దోహదపడుతుంది. క్రీడల వల్ల చదువు పట్ల ఏకాగ్రత పెరుగుతుందని అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా "ఆడుదాం ఆంధ్ర" పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించడాన్ని అభినందించాలి. దీంతో పాటు 15 ఏళ్ల లోపు పిల్లలకు కూడా ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహిస్తే బాగుండేది. ప్రాథమిక స్థాయి నుంచి ఇటువంటి ఆటల పోటీలు పిల్లలకు నాయకత్వ లక్షణాలు నేర్పుతాయి. సమిష్టితత్వం అలవడుతుంది. ఇందులో అథ్లెటిక్స్ కూడా చేర్చి ఉంటే మరింత ఉత్సాహంగా యువత పాల్గొనేవారు.

ఇదంతా బాగానే ఉన్నా ఈ పోటీలకు గ్రామాల్లో, మండలాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో తగిన ఆటస్థలాల్లేవు. మరి ఎక్కడ నిర్వహిస్తారన్నదే పశ్న. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందు గ్రామ స్థాయి నుంచి క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి, క్రీడా సామగ్రిని సమకూర్చి, వసతులు కల్పిస్తే "ఆడుదాం ఆంధ్ర" తప్పకుండా విజయం సాధిస్తుంది. ప్రస్తుత స్థితి అయితే కేవలం ప్రభుత్వ ప్రచార ఆర్భాటం కోసం హడావుడిగానే మిగిలిపోతుంది. ఇప్పటికే క్రీడల్లో మన రాష్ట్రం బాగా వెనుకబడి ఉంది. కొన్ని క్రీడా మైదానాలు కబ్జాకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రాయలసీమ విశ్వవిద్యాలయంలోనే స్టాండింగ్ ట్రాక్‌లు లేవంటే మారుమూల గ్రామాల పరిస్థితి అర్థం అవుతుంది. ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకునే నాడు నేడు పేరుతో ఒక్క క్రీడా మైదానాన్ని నిర్మించారా? గత ప్రభుత్వం గాండీవం పేరుతో పాంచజన్య ప్రాజెక్టు కింద నిధులు కేటాయించినా పూర్తి స్థాయిలో ఖర్చు చేయకుండా క్రీడలకు అన్యాయం చేసింది. ప్రస్తుత యువ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో పరిస్థితి మారుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది.

సిఎం పుట్టిన రోజున సీఎం కప్పు పేరుతో క్రీడలు నిర్వహించి పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు తప్ప నిధులు ఇవ్వలేదు. దీంతో పిల్లల చార్జీలు, ఇతర ఖర్చులు పీడీలు, పీఈటీలే భరించారు. ఇంకొన్ని చోట్ల విద్యార్థులే భరించాల్సిన పరిస్థితి వచ్చింది. అంత పెద్ద టోర్నీ నిర్వహించి నిధులు ఇవ్వకపోవడం ఏమిటి? గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన 36వ జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన వారికి ప్రోత్సాహకాలు ఇప్పటివరకు అరకొరగా చెల్లించింది. ఇందులో స్వర్ణపతకం 5 లక్షలు, రజిత పతకం 4 లక్షలు, క్యాంసం పతకం సాధించిన వారికి 3 లక్షల రూపాయల చొప్పున అందించాలి. జీవోలు ఇచ్చారు తప్ప నగదు మాత్రం ఇవ్వకుండా శాప్ కార్యాలయం చుట్టూ క్రీడాకారులను ప్రదక్షిణలు చేయిస్తున్నారు. మరి ఈ ఏడాది గోవాలో జరిగిన 37వ జాతీయ క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రోత్సాహకాలు ఎప్పుడిస్తారో చూడాలి!

శాప్ తీరే క్రీడాకారులకు శాపం

రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించడం, శిక్షణ, క్రీడా సామగ్రి ఇచ్చి ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దడం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఉద్దేశం. కానీ ఇప్పుడు దానికి బదులుగా శాప్ వ్యాపారం చేస్తోంది. ఎవరైనా క్రీడలు నేర్చుకోవాలని ప్లే గ్రౌండ్‌కు వస్తే గంటల చొప్పున రేటు నిర్ణయించారు. క్రీడా మైదానాలను, స్టేడియాలను, స్విమ్మింగ్ పూల్, జిమ్ సెంటర్లను నిర్వీర్యం చేసేందుకు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు. మహిళా క్రీడాకారులను వేధించడంపై పెద్ద ఎత్తున విమర్శలు రావడం, నగదు ప్రోత్సాహకాల కోసం వచ్చిన వారిని కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం, సామగ్రి కొనుగోలులో అవినీతి ఆరోపణలొస్తున్నాయి. ఇటీవల కాలంలో శాప్‌లో కోచ్‌ల రిక్రూట్మెంట్ లేదు. పర్మినెంటు కోచ్‌లు పట్టుమని పదిమంది లేరు. కనీస వేతనాలివ్వడం లేదు. గత ఐదు నెలలుగా వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఔట్ సోర్సింగ్ ద్వారా తీసుకున్న కోచ్‌లకు వేతనం రూ. 19,500, DSA కోచ్‌లకు వేతనం రూ.15,000 ఇస్తున్నారు. చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు కోచ్‌లు. అర్హత, వారు సాధించిన పతకాల ఆధారంగా కోచ్‌లను ఎందుకు పర్మినెంట్ చేయడం లేదు?

షెడ్యూల్

డిసెంబర్ 15 నుంచి 20 వరకు గ్రామ/వార్డు స్థాయిలో, 21 నుంచి జనవరి 4 వరకు మండల స్థాయిలో, జనవరి 5 నుంచి 10 వరకు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 11 నుంచి 21 వరకు జిల్లా స్థాయి, జనవరి 22 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలకు 15 ఏళ్ల వయసు నుంచి పైబడిన ప్రతి ఒక్కరూ అర్హులే. ప్రతి క్రీడాకారుడూ రెండు క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉంది. అన్ని క్రీడా పోటీల్లోనూ మహిళలకూ ప్రవేశం ఉంది. వారికి వేరుగా పోటీలు నిర్వహిస్తారు. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 13 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ ప్రభుత్వం ఇచ్చిన లింక్ ద్వారా గానీ, 1902కి కాల్ చేసి గానీ, సచివాలయం దగ్గర గానీ, వలంటీర్ల ద్వారా గానీ నమోదు చేసుకోవచ్చు. మొత్తం 3 లక్షల మ్యాచ్‌లు నిర్వహిస్తారు. వీటితో పాటు కాలయాపన కోసం యోగా, మారథాన్, టెన్నీకాయిట్ వంటి పోటీలేని సంప్రదాయ క్రీడలు నిర్వహించనుంది.

> **గ్రామాల్లో, మండలాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో తగిన ఆటస్థలాల్లేవు. మరి ఎక్కడ నిర్వహిస్తారన్నదే పశ్న. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందు గ్రామ స్థాయి నుంచి క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి, క్రీడా సామగ్రిని సమకూర్చి, వసతులు కల్పిస్తే "ఆడుదాం ఆంధ్ర" తప్పకుండా విజయం సాధిస్తుంది. ప్రస్తుత స్థితి అయితే కేవలం ప్రభుత్వ ప్రచార ఆర్భాటం కోసం హడావుడిగానే మిగిలిపోతుంది. ఇప్పటికే క్రీడల్లో మన రాష్ట్రం బాగా వెనుకబడి ఉంది. కొన్ని క్రీడా మైదానాలు కబ్జాకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.**

ఈ క్రీడలను ఎవరు నిర్వహించాలి ?

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలు టోర్నీని జిల్లా కలెక్టర్, సిఇఒ, చీఫ్ కోచ్‌ల సమన్వయంతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఎలా నిర్వహిస్తారు? వారికి ఉన్న అవగాహన ఎంత? రాష్ట్ర వ్యాప్తంగా 15004 గ్రామ/వార్డు సచివాలయాల్లో ప్రతి సచివాలయం నుంచి 10 మంది వలంటీర్లను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తారు. సుమారు 1.50 లక్షలమంది వలంటీర్లకు ఐదు రకాల క్రీడల నిర్వహణకు అవగాహన కల్పించేందుకు పీఈటి, పిడి, జిల్లా చీఫ్ కోచ్‌ల ద్వారా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆన్‌లైన్‌లో ఐదు రకాల క్రీడలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. మొత్తం క్రీడాకారులు 34 లక్షల మంది పాల్గొంటారని అంచనా. సంవత్సరాలుగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్య చదివిన వారిని పక్కన పెట్టి కేవలం వారం రోజులు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చి ఆటలు నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటి? అది జరిగే పనేనా? రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగులు UGD, MPED, BPED తదితర ఫిజికల్ కోర్సులు చదివి ఉన్నారు కదా. వారిని ఎందుకు ఉపయోగించరాదు. 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు యాడ్స్ ఇచ్చి ప్రచారం చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ యువతపై ఎందుకు చూపడం లేదు?

బాల్యం నుంచే ప్రారంభం


క్రీడల అభివద్ధిలో దేశం వెనకబడి ఉంది. ఇటీవల బీజింగ్‌లో జరిగిన 19వ ఆసియా క్రీడల్లో 107 పతకాలు సాధించి పర్వాలేదు అనిపించినా అది ప్రభుత్వ ప్రోత్సాహంతో కాక...వారి సొంత సామర్థ్యంతో నెట్టుకొచ్చారు అన్నది మాత్రం నిజం. మన జనాభా ప్రకారం మనం ఎక్కడ ఉండాలి. ఎక్కడ ఉన్నాం. అనేది చూస్తే అర్థం అవుతుంది. ఉదాహరణకు మన పక్కనే ఉన్న చైనా క్రీడల కోసం నిధులు కేటాయింపు, బాల్య దశ నుంచి శిక్షణ, ప్రోత్సాహం ఇవ్వడం వల్ల ఈరోజు ఆసియా క్రీడల్లో మొదటి స్థానంలో, ఒలింపిక్స్‌లో అమెరికాను చివరి దాకా వెంటబడి రెండో స్థానంలో నిలిచింది. కేవలం ఒలింపిక్స్‌లో, అంతర్జాతీయ స్థాయిలో గెలిచినప్పుడు మాత్రం కోట్ల రూపాయలు నగదు ప్రకటించి, ఉద్యోగం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత క్రీడల ఊసే ఉండదు.

మన రాష్ట్రంలో వందలాది పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుడు లేరు. ఒక సర్వే ప్రకారం రెండు వేల మందికి ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడూ లేడు. పాఠశాలలకు ప్రతి ఏడాది స్పోర్ట్స్ కిట్టు ఇవ్వలేకపోతే వారు ఏమి నేర్చుకుంటారు? దేంతో ప్రాక్టీస్ చేయాలి? ఏదైనా జోనల్స్ జరిగితే సొంత ఖర్చుతోనో లేదా వ్యాయామ ఉపాధ్యాయుడి ఖర్చుతోనో లేదా దాతల సహకారంతోనో వెళ్లాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితి ఎందుకు వచ్చింది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే మంచి ఫలితాలు వస్తాయి కదా. గతంలో ప్రతి మండలానికి ఇండోర్ స్టేడియం అని 2.10 కోట్ల రూపాయలు కేటాయించారు. ఎక్కడా పనులు పూర్తి కాలేదు. ఇప్పటివరకు గుంతలు తవ్వి వదిలేశారు. కొన్ని చోట్ల ట్రాక్ వేసి వదిలేశారు. వెయ్యి మంది విద్యార్థులు ఉన్న హైస్కూల్లోనే సంవత్సరానికి క్రీడల కోసం ఒక్క పైసా కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు.

ప్రైవేట్ పాఠశాలల్లో అయితే సరే సరి. కనీసం ఉదయం ప్రేయర్ చేసుకోవడానికి కూడా స్థలం ఉండదు. అన్ని రూమ్‌లు అగ్గిపెట్టెల్లాగా ఉంటాయి. 74 జీవోను సైతం సక్రమంగా అమలు చేయడం లేదు. కేరళ, తమిళనాడు, పంజాబ్, హర్యానా రాష్ట్రాలు పెద్ద ఎత్తున క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 4 శాతం అమలు చేస్తున్నారు. కొన్ని ఉద్యోగాలు డైరెక్ట్‌గా స్పోర్ట్స్ కోటాలో ఇస్తున్నారు. మన రాష్ట్రంలో మాత్రం అలా జరగడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బాల్య దశలోనే క్రీడలకు ప్రాధాన్యత, క్రీడా రంగానికి నిధులిచ్చి విద్యార్థులను ప్రోత్సహించాలి. ఉద్యోగాల్లో 2% కోటాను పెంచాలి.

ఆడుదాం ఆంధ్ర ప్రోత్సాహకాలు

'ఆడుదాం ఆంధ్ర' టోర్నీలో పాల్గొనే జట్లకు ఐదు దశల్లో మొదటి రెండింటికి నగదు బహుమతి లేదు. కేవలం షీల్డ్, సర్టిఫికేట్లు మాత్రమే అందజేస్తారు. అయితే సర్టిఫికేట్లకు ఎటువంటి విలువ ఉండదనేది వాస్తవం. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లేదా రిజిస్ట్రేషన్ క్రీడా సంఘాలు ఇచ్చే సర్టిఫికేట్లకు మాత్రమే విలువ ఉంటుంది. గతంలో



నిర్వహించిన సీఎం కప్పునకు నిధులివ్వకుండా చేసినట్లు ఇప్పుడు కూడా చేయరు కదా ! అని క్రీడాకారులు భయపడుతున్నారు.

బ్రాండ్ అంబాసిడర్లు

ఆసియా క్రీడల్లో గెలుపొందిన మన తెలుగు బిడ్డ మైనేని సాకేత్ (రజితం) టెన్నిస్ క్రీడాకారుడు. వెన్నం జ్యోతి సురేఖ, యర్రాజి జ్యోతి, బొమ్మదేవర ధీరజ్, కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక వంటి క్రీడాకారులను దీనికి బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించడం ఆహ్వానించదగ్గ విషయం. రాష్ట్రానికి పేరు, ప్రతిష్ట తెచ్చి తెలుగు జాతి గౌరవాన్ని దేశం నలుమూలలకు తీసుకెళ్లిన వారికి తగిన గౌరవం దక్కింది. అదేవిధంగా జిల్లాలు, నియోజకవర్గాల స్థాయిలో కూడా మరికొంతమంది పతకాలు సాధించిన క్రీడాకారులను ఎంపిక చేశారు.

ఇప్పటికైనా ప్రభుత్వం చేయాల్సినవి

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలి. ప్రతి మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియాలను నిర్మించాలి. ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడ్ని నియమించి స్పోర్ట్స్ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేయాలి. ఆగిన జోనల్స్ ప్రారంభించాలి, కోచ్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలి. ఉన్న కోచ్‌లకు కనీస వేతనాలు చెల్లించాలి. ఉద్యోగాలలో స్పోర్ట్స్ కోటాను పెంచాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గెలుపొందిన వారికి పెండింగ్‌లో ఉన్న నగదు ప్రోత్సాహకాలు వెంటనే చెల్లించాలి. కబ్జాకు గురైన క్రీడా మైదానాలను కాపాడాలి. పేఢప్లే విధానాన్ని రద్దు చేయాలి. క్రీడల అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధుల కేటాయించి ఖర్చు చేయాలి. శాప్ కోచ్‌లకు కనీస వేతనాలు అమలు చేయాలి.

(వ్యాస రచయిత
డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి.9177590726)

★

గాజా మారణకాండ మరింత తీవ్రం - సొరంగాల్లో ఉప్పునీరు !

విశ్లేషణ



ఎం కోటేశ్వరరావు

మానవాళి చరిత్రలో అత్యంత విషాదానికి దారితీసే విధంగా గాజాలో పరిస్థితి ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి రిచర్డ్ పీపర్‌కోన్ చెప్పాడు. పశ్చిమ గట్టు ప్రాంతంలో కూడా పాలస్తీనా పౌరుల మీద దాడులు కొనసాగుతున్నాయి. గాజాలో పౌరుల సామూహిక వధను ఆపాలని, ఐరాస సభ్యదేశాలు ఈ సంక్షోభంలో జోక్యం చేసుకోవాలని పాలస్తీనాలో మానవహక్కులపై ఐరాస ప్రత్యేక నివేదకురాలు ఫ్రాన్సెస్కా అల్బనీస్ కోరారు.. కేవలం హమాస్‌ను మాత్రమే కాదు మొత్తం గాజాను నాశనం చేయడం లక్ష్యమని అల్బనీస్ అన్నారు. ప్రస్తుత యుద్ధం ముగిసిన తరువాత గాజాను మిలిటరీ రహిత ప్రాంతంగా మారుస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించాడు. పోరు ఎంతకాలం సాగినా కొనసాగించేందుకు తాము సన్నద్ధంగా ఉన్నట్లు హమాస్ సీనియర్ నేత ఒసామా హందన్ చెప్పాడు. గాజాలో మానవ సర్వనాశనం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, అంతర్జాతీయ చట్టాలను పాటించాలని, రెండు దేశాల ఏర్పాటు పరిష్కారానికి యత్నాలను తీవ్రతరం గావించాలని కతార్-సౌదీ సమన్వయ కమిటీ కోరింది. తమ వైమానిక దాడుల్లో అనేక మంది హమాస్ నేతలను హతమార్చినట్లు ఇజ్రాయిల్ చెప్పుకుంది..

ఏడు రోజుల విరామంలో హమాస్ వద్ద ఉన్న వారిలో వంద మంది బందీలు, ఇజ్రాయిల్ జైళ్లల్లో అక్రమంగా నిర్బంధంలో ఉన్న పాలస్తీనా పౌరుల్లో 240 మంది విడుదల తరువాత పెద్ద ఎత్తున గాజా మీద ఇజ్రాయిల్ దాడులకు దిగింది. ఇంకా హమాస్ వద్ద 138 మంది బందీలు, వేలాది మంది పాలస్తీనా పౌరులు జైళ్లల్లో ఉన్నారు. బుధవారం ఉదయానికి అందిన సమాచారం మేరకు గత రెండు నెలల దాడుల్లో 16,248 మంది పాలస్తీనియన్లు మరణించారు. దాదాపు 50వేల మంది గాయపడ్డారు.మరికొన్ని వేల మంది శిధిలాల కింద మరణించి ఉంటారని భయపడుతున్నారు. దాడులను విరమించే వరకు చర్చల ప్రసక్తే లేదని హమాస్, దాడులను కొనసాగించి తీరుతామని



ఇజ్రాయిల్ ప్రకటించాయి. ఇదిలా ఉండగా బందీల విడుదలకు ప్రధాని నెతన్యాహు ప్రయత్నించడం లేదని అనేక మంది తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇజ్రాయిల్ మారణకాండను కొనసాగించడంతో ప్రపంచ మంతటా తీవ్ర నిరసన వెల్లడవుతుండటంతో ఇజ్రాయిల్ ప్రభుత్వం, దానికి వంతపాడే బిబిసి వంటి మీడియా సంస్థలు, నిస్సిగ్గుగా మద్దతు ఇస్తున్న జో బైడెన్ వంటి వారు అరవై రోజుల తరువాత కొత్త పల్లవి అందుకున్నారు. గాజాలోని సొరంగాల్లో దాగి ఉన్నారని భావిస్తున్న హమాస్ సాయుధులను వెలుపలికి రప్పించేందుకు విష పూరిత వాయువులను పంపాలని గతంలో ఇజ్రాయిల్ ఆలోచించింది. ఇప్పుడు దాని బదులు మధ్యధరా సముద్రం నుంచి నీటిని తోడి సొరంగాల్లోకి పంపాలని చూస్తున్నది.

దక్షిణ గాజాలో రెండు లక్షల మందికి పైగా జనాభా ఉన్న ఖాన్‌యూనిస్ పట్టణాన్ని సర్వనాశనం చేసేందుకు మంగళవారం నుండి ఇజ్రాయిల్ సేనలు విమానాలు, టాంకులతో దాడులు జరుపుతున్నాయి. అక్కడ ఎందరు ప్రాణాలు కోల్పోయిందీ ఇంకా వెల్లడి కాలేదు. పౌరులు పట్టణాన్ని ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మరింత దక్షిణంగా అంటే ఈజిప్టు సరిహద్దువైపు వెళ్లాలంటూ వెదజల్లిన కరపత్రాలలో పేర్కొన్నారు. తమ భూభాగంలోకి శరణార్థులు రాకుండా ఈజిప్టు సరిహద్దులను మూసివేసింది. ఉత్తర గాజాతో పోలిస్తే దక్షిణ ప్రాంతంలో జన నష్టం జరగకుండా నిర్దిష్ట సమాచారంతో దాడులు జరుపుతున్నట్లు ప్రపంచాన్ని నమ్మించేందుకు ఇజ్రాయిల్ చూస్తున్నది. జనాన్ని అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు వెళ్లిపోవాలని తరుముతున్న ఇజ్రాయిల్ మిలిటరీ నుంచి అమాయకులైన పౌరులకు ఎక్కడా రక్షిత ప్రాంతమంటూ లేకుండా పోయింది. ఒకసారి ఖాళీ చేసిన ప్రాంతానికి తిరిగి అనుమతించటం లేదు. ఖాన్ యూనిస్ పట్టణం చుట్టూ ఆరుకిలోమీటర్ల పరిధిలో 150 ఇజ్రాయిలీ టాంకులు, సాయుధులతో కూడిన అనేక వాహనాలున్నట్లు ఉపగ్రహ చిత్రాలు చూపుతున్నాయి.యుద్ధ విమానాలు కూడా దాడులు జరుపుతున్నాయి. మరోసారి అక్టోబరు ఏడున హమాస్ జరిపిన మాదిరిదాడులు పునరావృతం కాకుండా చూసేందుకు ఆ సంస్థ మిలిటరీ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసే దిశగా తాము దాడులు జరుపుతున్నట్లు ఇజ్రాయిల్ చెబుతున్నది.

అన్ని రకాల మత, నైతిక, మానవతా విలువలను ఉల్లంఘిస్తున్న ఇజ్రాయిల్ ఆక్రమిత పాలస్తీనాలో మారణకాండ జరుపుతున్నదని ఏడు రోజుల దాడుల విరామం, బందీలు, ఖైదీల విడుదల చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన కతార్ పాలకుడు హమద్ అల్ తానీ దోహాలో జరిగిన అరబ్ నేతల సమావేశంలో విమర్శించాడు. ఆత్మరక్షణ పేరుతో ఇదంతా చేస్తున్నారని మారణకాండ నేరాన్ని ఆత్మరక్షణ అనుమతిస్తుందా అని ప్రశ్నించారు. కతార్‌లో హమాస్ రాజకీయ కార్యాలయంతో పాటు అనేక మంది నేతలు అక్కడే ఉంటున్నారు. ఇజ్రాయెల్ షిన్‌బెట్ భద్రతా సంస్థ అధిపతి రొనెన్ బార్ ఒక ఆడియో ప్రకటన చేస్తూ కతార్‌తో సహా హమాస్ నేతలు ఎక్కడ ఉన్నా వారిని అంతం చేస్తామని బెదిరించాడు. గాజా మీద రెండవ దశ పేరుతో పెద్ద ఎత్తున దాడులు చేస్తున్న ఇజ్రాయిల్ సరిహద్దులో ఉన్న లెబనాన్ను కూడా కవ్విస్తున్నది. అక్కడ ఉన్న హిజబుల్లా సాయుధులపై జరిపిన దాడిలో లెబనాన్ మిలిటరీ పోస్టులో ఉన్న ఒక సైనికుడి ప్రాణాలు పోయినట్లు లెబనాన్ ప్రకటించింది. సరిహద్దు ఆవల నుంచి తమ మీద దాడి జరిగిందని, క్షిపణులు జనం లేని చోట పడినట్లు, తమ విమానాలు హిజబుల్లా మిలిటరీ కేంద్రాల మీద దాడులు చేసినట్లు ఇజ్రాయిల్ చెబుతున్నది.

గాజాలో జరుపుతున్న నేరాలను ఇతర ప్రాంతాలకు విస్తరించవద్దని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు హితవు చెప్పాడు. అదే జరిగితే మొత్తం ప్రాంత భద్రతకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించాడు.

హమాస్ సాయుధుల జాడ కనుగొనడంలో విఫలమైన ఇజ్రాయిల్ తొలుత వారు తలదాచుకుంటున్నట్లు భావిస్తున్న సొరంగాల్లో విషవాయువులను నింపి వెలుపలికి వచ్చేట్లు చేయాలని చూసింది. తాజాగా వాటిని సముద్రపు నీటితో నింపాలని ఏర్పాట్లు చేస్తున్నది. ఈ దుష్ట ఆలోచన గురించి అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. అదే జరిగితే ఇప్పటికే కాలుష్యమైన గాజా ప్రాంతంలో మరిన్ని పర్యావరణ సమస్యలతో పాటు రానున్న అనేక తరాల మీద ప్రతికూల ప్రభావం పడుతుందని, మంచి నీటి వనరులన్నీ ఉప్పునీటితో నిండుతాయని అనేక మంది హెచ్చరిస్తున్నారు. నవంబరు రెండవ వారంలోనే ఆల్ షాతి నిర్వాసిత శిబిరం సమీపంలో ఐదు భారీ పంపులను ఏర్పాటు చేసింది. మధ్యధరా సముద్రం నుంచి నీటిని తోడి సొరంగాల్లో నింపేందుకే ఈ ఏర్పాటు. హమాస్ సాయుధులను ఏరివేసేందుకు తాము అనేక పద్ధతుల గురించి పరిశీలిస్తున్నామని వాటిలో ఒకటి నీటితో నింపటమని ఇజ్రాయిల్ మిలిటరీ అధికారి చెప్పినట్లు అమెరికా పత్రిక పేర్కొన్నది. అదే జరిగితే అంతర్జాతీయంగా వెలువడే ఖండనలు జో బైడెన్ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తాయని అమెరికా మాజీ అధికారి ఒకడు చెప్పాడు. ఈజిప్టు 2015లో తన భూభాగంలో ఉన్న సొరంగాలను ఉప్పునీటితో నింపి దొంగ రవాణాను అరికట్టేందుకు పూనుకున్నపుడు ఆ ప్రాంత పంటలు దెబ్బతినట్లు రైతులు ఆందోళన చేశారు.అమెరికా ఇతర ఐరోపా ధనికదేశాల అండచూసుకొని చెలరేగుతున్న ఇజ్రాయిల్ మారణకాండకు ఇంకా ఎంత మంది బలికావాలన్న ప్రశ్న తలెత్తింది. ఈ దారుణాన్ని నివారించటంలో ఐక్యరాజ్యసమితి ఘోరంగా విఫలమైంది.

జనవాక్యం

ప్రజాకంటక పార్టీలకు చరమగీతం పాడాలి

ఎన్నికల పోకడలను అధ్యయనం చేసే సెఫాలజిస్ట్ ప్రాబల్యం భారతదేశంలో 2014 నుండి పెరిగిపోయింది. ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. కుక్క తోక ఆడించడం సహజం కానీ ఇప్పుడు తోకే కుక్కనాడిస్తుంది. ప్రధాన పార్టీలు వాటి ఊబిలో చిక్కుకొని వారు సూచించిన ఎటువంటి పనైనా చేయడానికి వెనుకాడడం లేదు. డబ్బు ఎంత ఖర్చయినా పర్వాలేదు, పార్టీ ఏదైనా పర్వాలేదు, గెలుపే ప్రధానంగా ఎన్నికల్లో పాల్గొనాలనే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు రంగంలోకి దిగుతున్నారు. ప్రజలకు మేలు చేసే అంశాల పట్ల ఫోకస్ ఉండట్లేదు.. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యం, రవాణా రంగం మార్కెట్ రంగం ఛిద్రం చేయడం, ఎవరికీ ఉపయోగపడని ఆత్మ నిర్భర్ భారత్, గరీబ్ కళ్యాణ్ యోజన, సంచయని యోజన లాంటి పథకాల పట్ల, సమాన విద్యావకాశాలు లేని నూతన విద్య విధానం పట్ల, కరువు, ఉపాధి వంటి విషయాలను పాలకులు పట్టించుకోవడం లేదు. కేవలం గెలుపు గుర్రాలను గుర్తించడం, డబ్బు ఎలా ఖర్చు పెట్టడం, అపాత్ర దానాలకు ఎలా శ్రీకారం చుట్టి ప్రజలను ప్రభావితం చేయడమే ఈ సెఫాలజిస్టుల పని. ముఖ్యమంత్రులను దేశాధిపతులను, పాలనలో నిర్ణయాధికార పాత్రను ఎవరు పోషించాలని సెఫాలజిస్టులు సూచిస్తున్నారంటే పరిస్థితి ఎంతకు దిగజారిందో అర్థమవుతోంది. దొంగ సర్వేలు, సెఫాలజిస్టుల మోసపూరిత ప్రకటనలు నమ్మి ఓటేస్తే జీవితాలను అంధకారంలోకి నెట్టినట్టే.

-డాక్టర్ ఎం సురేష్ బాబు

ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

- సమగ్ర శిక్ష డైరెక్టరు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలల్లో పనిచేసేందుకు వివిధ ఉద్యోగాలు ఇస్తున్నట్లు ప్రచారమవుతున్న మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దని సమగ్ర శిక్ష డైరెక్టరు బి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ డిజిటల్ ఎడ్యుకేషన్ ఆర్కిటెక్చర్ (ఎన్‌టిఇఆర్) ఆధ్వర్యంలో దీక్ష, నేషనల్ ఎడ్యుకేషన్ ఆర్కిటెక్చర్, అడల్ట్ ఎడ్యుకేషన్, యోగా ఎడ్యుకేషన్, మానిటరింగ్ మెకానిజమ్ వంటి వివిధ ఉద్యోగాలు ఇస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో పనిచేసేందుకు ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగ ప్రకటనలు ఇవ్వలేదని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత నుంచి డబ్బులు వసూలు చేయడానికే కొందరు ఇలాంటి మోసపూరితమైన ప్రకటనలు చేస్తున్నారని వివరించారు. యువత, వారి తల్లిదండ్రులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు షిర్డీ వెళ్లేందుకు పాస్‌లు ఇవ్వాలి

- ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు షిర్డీ వెళ్లేందుకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. ఈ మేరకు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిసిలో ప్రతియేటా ఉద్యోగులకు ఎల్‌టిసి సౌకర్యం వుండేదని, విలీనం తర్వాత అమలు చేయడం లేదని వివరించారు.

ఢిల్లీలో రేవంత్

- సోనియాసహా పలువురు ప్రముఖులకు ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో గురువారం జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని ఢిల్లీ అధిష్టానం పెద్దలుసహా పలువురికి సిఎల్‌పి నేత రేవంత్‌రెడ్డి ఆహ్వానం పలికారు. సిఎంగా హైకమాండ్ ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం రాత్రి ప్రత్యేక విమానంలో ఢిల్లీ చేరుకున్న రేవంత్ అక్కడ బిజీబిజీగా గడిపారు. అర్ధరాత్రి వరకు ఎఐసిసి పరిశీలకుడు, కర్ణాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్, రాష్ట్ర వ్యవహారాల మాజీ ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాకూర్‌తో భేటీ అయిన ఆయన, పలు అంశాలపై చర్చించారు. బుధవారం ఉదయం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కెసి వేణుగోపాల్‌ను కలిసి, మంత్రివర్గంపై చర్చలు జరిపినట్లు తెలిసింది. ఎఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానించారు. తొలుత కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాహుల్, ప్రియాంక గాంధీలను కలిసి, ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. హర్యానా ఎంపి దీపేందర్ సింగ్ హుడాను కూడా ఆహ్వానించారు. పార్లమెంటుకు చేరుకున్న రేవంత్‌రెడ్డి.. అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. రేవంత్‌రెడ్డికి రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి ప్రజాసర్కారును నిర్మిస్తుందంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



రాహుల్, ప్రియాంకలను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానిస్తున్న రేవంత్

అభినందనల వెల్లువ

ఎంపి సిఎం రమేష్‌కు చెందిన పార్లమెంటు ఓల్డ్ బిల్డింగ్‌లోని 64 నెంబర్ రూంలో రేవంత్‌కు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. వైసిపి ఎంపిలు నిరంజన్ రెడ్డి, కోటగిరి శ్రీధర్, టిడిపి ఎంపిలు రామ్మోహన్‌నాయుడు, కనకమేడల రవీంద్ర కుమార్, తమిళనాడుకు చెందిన కాంగ్రెస్ ఎంపి జ్యోతిమణి, కేరళకు చెందిన ఎంపి హిబి హిడెన్ తదితరులు హాజరయ్యారు. అనంతరం లోక్‌సభ స్పీకరు ఓం బిర్లాను కలిసి ఎంపి పదవికి రాజీనామాపై చర్చించారు. బిఆర్ఎస్ ఎంపి రాములు నాయక్, ఎంపిలు రఘురామ కృష్ణరాజు, రమ్య హరిదాసు, మనీష్ తివారీ తదితరులు అభినందనలు తెలిపారు. అనంతరం ప్రత్యేక విమానంలో రేవంత్ హైదరాబాద్ వెళ్లారు. ఆయన వెంట మాణిక్ రావ్ థాక్రే, షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, బలరాం నాయక్ ఉన్నారు.

తెలంగాణ ప్రభావం రాష్ట్రంపై ఉండదు

- మంత్రి ఉష శ్రీచరణ్

రాయదుర్గం : ఇటీవల వెలువడిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం రాష్ట్రంపై ఏమాత్రం ఉండదని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీలకు మంచి చేయాలన్న దృఢ సంకల్పంతో సిఎం జగన్ ముందుకెళ్తున్నారన్నారు. ప్రజలు ఏ సచివాలయానికి వెళ్లినా అక్కడ పనితీరును బట్టి పరిస్థితిని అంచనా వేయవచ్చన్నారు. ఈనేపథ్యంలో ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి టిడిపి నాయకులు ఓర్వలేక తమ ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేయిస్తున్నారన్నారు. ఇది రాబోయే రోజుల్లో వారికి తీవ్రమైన నష్టం, పతనం కలిగిస్తుందన్నారు. మంత్రి జయరాం మాట్లాడుతూ తాను గతంలో అసెంబ్లీలో వాల్మీకులకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీశానన్నారు. అందుకే అప్పట్లో కాలవ శ్రీనివాసులకు మంత్రి పదవి దక్కిందన్నారు. ఈ విషయం ఆయన గ్రహించాలన్నారు. జిల్లాలో కూడా బిసి,ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలకు అనేక పదవులను ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వారి అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు.

ప్రకాశం బ్యారేజ్‌కి వరద పోటు

- నాలుగు గేట్లు ఎత్తిన అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తుపాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, మన రాష్ట్రంలోని కృష్ణా, గుంటూరు జిల్లాలో కురిసిన వర్షాలతో ప్రకాశం బ్యారేజ్‌కి భారీగా వరద నీరు చేరుతుంది. బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 3.09 టిఎంసిలకు మించి వరద నీరు రావడంతో అధికారులు నాలుగు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి నిల్వను ఉంచుతూ సుమారు 7 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నాలుగు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 7 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజ్‌కి ఎగువన, దిగువన కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ అధికారులకు జలవనరులశాఖ అధికారులు సూచించారు. వర్షాలతో ప్రకాశం బ్యారేజీ నుంచి పంట కాలువలకు నీటి విడుదలను నిలిపివేశారు.

ఆశ, అవరోధాల మధ్య వాతావరణ చర్చలు

- పురోగతి సాధనపై కాప్ 28 నేతల ఊగిసలాట

దుబాయ్ : కాలుష్య కారకాలను తగ్గించే లక్ష్యంతో వాతావరణ చర్చలు ప్రారంభమై వారం గడిచింది. కాప్28 సదస్సు ప్రారంభంలోనే నష్టపరిహారం నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం ద్వారా సత్వర కార్యాచరణను, ఒప్పందాన్ని ఆమోదించిన నేతల చర్చలు ప్రస్తుతం ఆశలు, అవరోధాల మధ్య ఊగిసలాడుతున్నాయి. "చర్చలు ఇప్పుడు మిశ్రమ స్పందనగా వున్నాయి. కొన్ని రంగాలకు సంబంధించి దేశాల మధ్య పెద్ద తేడాలే కనిపిస్తున్నాయి." అని జర్మనీ వాతావరణ దూత జెన్నిఫర్ మోర్గాన్ వ్యాఖ్యానించారు. 'అయితే పురోగతి సాధించేందుకు సంకల్పం మాత్రం వుంది." అని స్పష్టం చేశారు. చమురు, గ్యాస్, బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను దశలవారీగా రూపుమాపాలని కోరుతున్న ప్రతిపాదకులు ఇన్నేళ్ళలో మొదటిసారిగా చర్చల పట్ల ఆశాభావంతో వున్నారని అధికారులు పేర్కొంటున్నారు. కానీ, అది ఎక్కడ దాడి చేస్తుందో కూడా చూడాల్సి వుంటుందన్నారు. పేద దేశాలకు ఆర్థిక సాయం అందించాలనే కీలకమైన అంశాలపై ఎలా ముందుకు సాగాలనే విషయమై ఇంకా కసరత్తు జరగాల్సి వుందని అధికారులు తెలిపారు. నష్టపరిహార నిధిని సదస్సు మొదటి రోజే ప్రకటించగా, ఇప్పటివరకు 720 మిలియన్ల డాలర్లుకు పైగా ఆ నిధికి అందాయి. అయితే ఈ విజయానికి ఇక్కడతో ఫుల్‌స్టాప్ పెట్టడానికి వీల్లేదని ఐక్యరాజ్య సమితి వాతావరణ కార్యదర్శి సైమన్ స్టీల్ బుధవారం హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా కాలుష్య వాయువులను తగ్గించేందుకు అవసరమైన కోట్లాది డాలర్ల ఆర్థిక సాయం సమస్యను ఇది పరిష్కరించిందని భావిస్తున్నారు.

కాప్ అధ్యక్ష వర్గంలో నెంబరు టూ స్థానంలో వున్న, ఐక్యరాజ్య సమితి దౌత్యవేత్త అద్నన్ అమిన్ మాట్లాడుతూ, చర్చల పట్ల ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అన్ని చర్చల ప్రక్రియల్లోనూ ఒడిదుడుకులు, ఎత్తుపల్లాలు వుంటాయి.

ఇందులో కూడా అంతే, అయితే ఇటువంటి పరిస్థితుల్లో కూడా ఇంకా కొంత సానుకూలత, ఆశాభావం నెలకొన్నాయన్నారు. గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీలకు పరిమితం చేయడానికి ఉద్దేశించి ప్రపంచ దేశాలు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, లక్ష్యాల సాధనపై ప్రధానంగా చర్చలు కేంద్రీకరించబడ్డాయి. మంగళవారం ఒక ముసాయిదా డాక్యుమెంట్‌ను 24 పేజీలతో రూపొందించారు. కానీ వచ్చే వారంతో సదస్సు ముగిసిపోతున్న నేపథ్యంలో ఏ అంశాలపై అంగీకారం కుదిరింది, ఒప్పంద అంశాలేంటనే విషయాలపై సదస్సు ఎలాంటి సంకేతాలను ఇవ్వలేదు. 197 దేశాల ప్రతినిధులూ దీనిపై చర్చిస్తున్నారని, అనేక డిమాండ్లు, అవసరాలు వున్నాయని, ముందుకు సాగేందుకు ఈ చర్చలు మంచి ప్రాతిపదిక ఇస్తాయని భావిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి సమయంలో మనం విఫలమైతే పర్యవసానాలు భయంకరంగా వుంటాయన్నారు.

శిలాజ ఇంధనాలకు సంబంధించి ఉపయోగించాల్సిన పదజాలం, భాషపై ఐక్యరాజ్య సమితి అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు. మండుతున్న బొగ్గు, చమురు, వాయువులు వాతావరణ మార్పులకు ప్రధాన కారకాలుగా వున్నాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా సాగుతున్న చర్చల ప్రక్రియలో మొదటిసారిగా ఈ మూడు అంశాలను ఎజెండాలో నుండి తొలగించే ఆలోచన చేస్తున్నారు. ఉపయోగించే భాష లేదా పదజాలం, సమయం, అర్థం వంటి వాటికి సంబంధించిన సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి వుందని స్టీల్ అన్నారు.



అంబేద్కర్ చిరస్మరణీయుడు

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిరస్మరణీయులని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున, పార్లమెంటు సభ్యులు గురుమూర్తి, నందిగం సురేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు జూపూడి ప్రభాకర్‌రావు, ప్రభుత్వ సలహాదారు నారమల్లి పద్మజ, ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్ కనకారావు మాదిగ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ.. అంబేద్కర్ అణగారిన వర్గాల కోసం పరితపించేవారని తెలిపారు. ఆయన ఆశయాలను రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు.



అది మానవతా ప్రాతిపదికన రూపొందించారు

- అక్రమ వలసదారులకు క్షమాభిక్షను కల్పించినట్టు కాదు
- పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : పౌరసత్వ చట్టం, 1955లోని సెక్షన్ 6ఏపై భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది బంగ్లాదేశ్ విముక్తి తర్వాత మానవతా ప్రాతిపదికన 1985లో రూపొందించబడిందనీ, భారత చరిత్రలో లోతుగా పొందుపరచబడిందని సుప్రీంకోర్టు తెలిపింది. అక్రమ వలసదారులకు మంజూరు చేసిన క్షమాభిక్షతో ఈ నిబంధనను సమానం చేయలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) డి.వై చంద్రచూడ్ మౌఖికంగా అభిప్రాయపడ్డారు. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఏ రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలంటూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. 1985లో కేంద్రం, అసోం ఉద్యమ నాయకుల మధ్య అస్సాం ఒప్పందంపై సంతకం చేసినప్పుడు చట్టం కింద సెక్షన్ 6ఏ ప్రత్యేక నిబంధనగా ప్రవేశపెట్టబడింది. ఇది జనవరి 1, 1966 నుంచి మార్చి 25, 1971 మధ్య అసోంకు వచ్చిన విదేశీయులను భారత పౌరసత్వం కోరడానికి అనుమతిస్తుంది. పౌరసత్వ చట్టంలోని ఈ నిబంధన బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారి అక్రమ చొరబాట్లను చట్టబద్ధం చేసిందని పిటిషనర్లు ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందిస్తూ.. ఈ నిబంధన ద్వారా ఎంత మంది లబ్ధి పొందారనే దానిపై అధికారిక డేటాను కోరింది.

పార్లమెంటుకు 'అసెంబ్లీ' విజేతలు రాజీనామా

- ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు సభ్యులుగా ఉంటూ ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన ఎంపీలు రాజీనామా చేశారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన 12 మంది బిజెపి ఎంపిలు బుధవారం తమ పార్లమెంట సభ్యత్వాలకు రాజీనామా చేశారు. వీరిలో ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉండటం విశేషం. బిజెపి అధ్యక్షులు జెపి నడ్డా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశం అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది. ఎంపి పదవులకు రాజీనామా చేసిన వారిలో మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేలుగా గెలిచిన ఎంపిలు నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, రాకేష్ సింగ్, ఉదయ్ ప్రతాప్, రితీ పాఠక్, ఛత్తీస్‌గఢ్ నుండి విజయం సాధించిన ఎంపిలు అరుణ్ సావో, గోమతి సాయి, రాజస్థాన్ నుండి గెలిచిన ఎంపిలు రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, దియా కుమారి, కిరోడి లాల్ మీనా ఉన్నారు. వీరిలో కేంద్ర మంత్రులుగా ఉన్న నరేంద్ర సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్ మంత్రి పదవులకు కూడా రాజీనామా చేశారు. కిరోడి లాల్ మీనా మాత్రమే రాజ్యసభ ఎంపిగా రాజీనామా చేశారు. మరో ఇద్దరు ఎంపిలు, కేంద్ర మంత్రి రేణుకా సింగ్, మహంత్ బాలక్‌నాథ్ కూడా లోక్‌సభకు రాజీనామా చేయనున్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో కొత్త ముఖ్యమంత్రులను ఎన్నుకునే ప్రక్రియలో భాగంగా రాజీనామా చేశారు. రాజీనామా చేసిన ఇతర ఎంపిలలో దియా కుమారి, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, రాకేష్ సింగ్ ఉన్నారు.

ఒకట్రెండు రోజుల్లో తెలంగాణ ఎంపిలు కూడా..!

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరుగురు ఎంపిలు పోటీ చేశారు. కాంగ్రెస్ నుంచి ముగ్గురు, బిజెపి నుంచి ఇద్దరు, బిఆర్ఎస్ నుంచి ఒకరు. అయితే వీరిలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఎంపిలు రేవంత్ రెడ్డి (కొడంగల్), ఉత్తమ్ కుమార్ రెడ్డి (హుజుర్‌నగర్), కోమటిరెడ్డి వెంకటరెడ్డి (నల్గొండ) ముగ్గురు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. అలాగే బిఆర్ఎస్ నుంచి కొత్త ప్రభాకర్ రెడ్డి (దుబ్బాక) పోటీ చేసి గెలిచారు. అయితే బిజెపి ఎంపిలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్ ఓటమి చెందారు. ఇప్పుడు గెలిచిన ముగ్గురు కాంగ్రెస్ ఎంపిలు, ఒక బిఆర్ఎస్ ఎంపి రాజీనామా చేయాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ గెలవడంతో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతున్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి మంత్రులు అయ్యే అవకాశం ఉంది. కనుక వారు తమ ఎంపి పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉంది. వీరు ఒకట్రెండు రోజుల్లో ఎంపి పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉంది. అయితే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తారా? ఎంపిగా కొనసాగుతారా? స్పష్టత రాలేదు. ఏదేమైనా రెండు పదవుల్లో ఒకదానికి 14 రోజుల్లో రాజీనామా చేయాల్సి ఉంటుంది.

పురుగు మందు డబ్బాలతో ఎన్‌హెచ్-544 భూ బాధితులనిరసన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సోములదొడ్డి నుంచి అమరావతి వరకూ వెళ్లే రహదారి 544 భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని బోడిగానిదొడ్డి గ్రామంలో పొలం సర్వే నంబర్ 112-2లో 47 మంది ఇళ్లు కోల్పోతున్నామన్నారు. అయితే గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసినప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే గతంలో నిర్ణయించిన మేరకు ఇవ్వకుండా పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. తమకు గతంలో ఇచ్చిన హామీ మేరకు పరిహారం చెల్లించాలని, లేకుంటే తమ తొలగింపును అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ రమాదేవి పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బాధితులు ఎం.రాజగోపాల్, ఆర్.నాగరాజు, వి. కృష్ణ, వి.వేణుగోపాల్, వి.సత్యనారాయణ, పాలు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆ వార్తలు పుకార్లు

- 'ఇండియా' సమావేశానికి తన గైర్హాజరిపై కథనాలపై బీహార్ సీఎం

న్యూఢిల్లీ : ఢిల్లీలో జరిగే ప్రతిపక్ష భారత కూటమి సమావేశానికి తాను హాజరు కావటం లేదన్న వార్తలను బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కొట్టిపారేశారు. ఆ వార్తలను "అత్యంత అర్థంలేనిది"గా అభివర్ణించారు. ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తలపెట్టిన సమావేశం డిసెంబర్ 17కు వాయిదా పడింది. తనకు జ్వరం ఉన్నందున సమావేశానికి హాజరు కాలేకపోయానని నితీశ్ అన్నారు. "నేను ఇండియా బ్లాక్ మీటింగ్‌కి హాజరు కాలేదని పుకార్లు వచ్చాయి. ఇది నాన్సెన్స్. ఆ సమయంలో నాకు జ్వరం వచ్చింది. తదుపరి మీటింగ్ ఎప్పుడు జరిగినా నేను ఖచ్చితంగా వెళ్తాను" అని నితీష్ అన్నారు. నితీష్ కుమార్‌కు బదులుగా సీనియర్ నేతలు జేడీ(యూ) చీఫ్ లాలన్ సింగ్, బీహార్ జలవనరుల శాఖ మంత్రి సంజయ్ కుమార్ ఝా సమావేశానికి హాజరవుతారని గతంలో వార్తలు వచ్చాయి. 2024 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వ్యూహాన్ని రచించేందుకు ప్రతిపక్ష భారత కూటమి నేతల సమావేశానికి మల్లికార్జున్ ఖర్గే పిలుపునిచ్చారు. అయితే, కొన్ని కారణాలతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సహా పలువురు నేతలు సమావేశానికి హాజరుకాకపోవడంతో అది వాయిదా పడింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో కాంగ్రెస్ ఈ సమావేశానికి పిలుపునివ్వటం ప్రాధాన్యతను సంతరించుకున్నది. 'ఇండియా' కూటమి కాంగ్రెస్ నేతృత్వంలోని పలు రాజకీయ పార్టీల కూటమి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని అధికార ఎన్డీయేను ఎదుర్కోవడానికి ఈ ఏడాది జూలైలో బెంగళూరులో జరిగిన ప్రతిపక్ష పార్టీ సమావేశంలో ఈ కూటమి ఏర్పడింది.

తెలంగాణ ఎమ్మెల్యేల్లో 82 మందిపై క్రిమినల్ కేసులు

- ఎడిఆర్ నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవల తెలంగాణ అసెంబ్లీ కి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో మొత్తం 82 మంది నేర చరిత్ర కలిగి ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటీ ఆఫ్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సంస్థ వెల్లడించింది. ఇందులో 59 మంది అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపింది. ఎడిఆర్ నివేదిక ప్రకారం.. 2018 తో పోల్చితే నేర చరిత్ర ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య 8 శాతం పెరగగా, అత్యంత తీవ్రమైన కేసులున్న ఎమ్మెల్యేల సంఖ్య 12 శాతం పెరిగింది. ఒక ఎమ్మెల్యేపై మర్డర్ కేసు(ఐపిసి 302), ఏడుగురు ఎమ్మెల్యేల పై హత్య యత్నం కేసు(ఐపిసి 307), ఇద్దరిపై మహిళ దాడి కేసులు ఉన్నట్లు అఫిడవిట్ లో పొందుపరిచినట్లు పేర్కొంది. క్రిమినల్ కేసుల్లో ఉన్న ఎమ్మెల్యేల్లో 51 మంది కాంగ్రెస్ నుంచి, 19 మంది బిఆర్ఎస్, 7 మంది బిజెపి నుంచి, నలుగురు ఎంఐఎం నుంచి విజయం సాధించారు. సిపిఐ నుంచి గెలిచిన ఒక్క ఎమ్మెల్యేపై కూడా క్రిమినల్ కేసు ఉన్నట్లు వెల్లడించింది. ఇదే సందర్భంలో కాంగ్రెస్ 31(48శాతం), బీఆర్ఎస్ 17(44 శాతం), బీజేపి 7(88శాతం), సీపీఐ 1 (100 శాతం), ఎంఐఎం 3(43శాతం) మంది ఎమ్మెల్యేల పై తీవ్రమైన నేర చరిత్ర ఉన్నట్లు స్పష్టం చేసింది.

40 మంది ఎమ్మెల్యేలు 12 పాస్

ఎన్నికైన మొత్తం 119 మంది ఎమ్మెల్యేల్లో 40 మంది 5 తరగతి నుంచి 12 వ తరగతి పాస్ అయ్యారు. 72 మంది గ్రాడ్యుయేట్ ఆపై చదువులు చదివారు. ఐదుగురు డిప్లమా హోల్డర్స్ కాగా, ఇద్దరు కేవలం అక్షరాస్యులు మాత్రమే. 25 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు 23 మంది ఎమ్మెల్యేలు ఉండగా, 96మంది 51 నుంచి 80 ఏళ్ల మధ్య వారున్నారు. 10 మంది మహిళలు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 26 ఏళ్లతో యంగెస్ట్ ఎమ్మెల్యేలుగా యశస్విని, మైనంపల్లి రోహిత్ లు ఉన్నారు. 74 ఏళ్లతో అతి పెద్ద వయస్సు ఎమ్మెల్యేగా పోచారం శ్రీనివాస్ రెడ్డి రికార్డులోకి ఎక్కారు.

ఛత్తీస్‌గఢ్ ఎమ్మెల్యేల్లో 72 మంది కోటీశ్వరులే

- అత్యధికంగా బిజెపిలో 43 మంది
- కాంగ్రెస్ నుంచి 29 మంది
- ఎడిఆర్-ఛత్తీస్‌గఢ్ ఎలక్షన్ వాచ్ నివేదిక

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర నూతన అసెంబ్లీ కోటీశ్వరులైన సభ్యులతో కొలువుదీరనున్నది. అసెంబ్లీకి ఎన్నికైన 90 మంది ఎమ్మెల్యేల్లో 72 మంది (80 శాతం మంది) కోటీశ్వరులే ఉన్నారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్), ఛత్తీస్‌గఢ్ ఎలక్షన్ వాచ్ విశ్లేషణలో ఇది వెల్లడైంది. దీని ప్రకారం.. కోటీశ్వరుల జాబితాలో బిజెపి నుంచే అత్యధికంగా 43 మంది కోటీశ్వరులు ఉండటం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల్లో కోటీశ్వరుల సంఖ్య 68గా ఉండగా.. అది 72కు పెరిగింది. బిజెపి నుంచి ఈ సారి ఎన్నికైన 54 మందిలో 43 మంది(80 శాతం మంది) ఒక్కొక్కరు రూ. 1 కోటి కంటే ఎక్కువ ఆస్తులను కలిగి ఉన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 35 మంది ఎమ్మెల్యేలతో ప్రధాన ప్రతిపక్షంగా ఏర్పడిన కాంగ్రెస్‌లో 29 మంది (83 శాతం మంది) కోటీశ్వరులు కావటం గమనార్హం.

సగటు ఆస్తులు రూ.5.25 కోట్లు

2018 అసెంబ్లీ ఎన్నికలలో ప్రతి ఎమ్మెల్యే ఆస్తుల సగటు రూ.11.63 కోట్లుగా ఉంటే అది ఈసారి రూ.5.25 కోట్లుగా ఉన్నది. రూ.33.86 కోట్ల ఆస్తులతో కోటీశ్వరుల క్లబ్‌లో బిజెపి ఎమ్మెల్యే (ఈమె మొదటిసారిగా ఎమ్మెల్యేగా విజయం సాధించారు) భవన్ బోహ్రా (పండరియా స్థానం) అగ్రస్థానంలో ఉన్నారు. రూ.33.38 కోట్ల ఆస్తులతో తాజా మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకుడు భూపేష్ బఘెల్ (పటాన్ నియోజకవర్గం) తర్వాతి స్థానంలో ఉన్నారు. బిజెపికె చెందిన అమర్ అగర్వాల్ (బిలాస్‌పూర్ స్థానం) రూ.27 కోట్లకు పైగా ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు. చంద్రాపూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్‌కుమార్ యాదవ్(రూ.10 లక్షలు), బిజెపి ఎమ్మెల్యేలు రామ్‌కుమార్ టోప్పో (రూ.13.12 లక్షలు), అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రస్తుత ఎంపీ గోమతి సాయి (రూ.15.47 లక్షలు)లు అత్యల్ప ఆస్తులున్న ఎమ్మెల్యేల జాబితాలో అట్టడుగున ఉన్నారు.



విద్యార్హతలు ఇలా..

90 మంది ఎమ్మెల్యేలలో 33 మంది (37 శాతం) 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉత్తీర్ణులైనట్టు ప్రకటించారని నివేదిక పేర్కొన్నది. అలాగే, 54 మంది ఎమ్మెల్యేలలో గరిష్టంగా 60 శాతం మంది గ్రాడ్యుయేట్ డిగ్రీలు లేదా అంతకంటే ఎక్కువ అర్హతలు కలిగి ఉన్నారు. మరో ఇద్దరు డిప్లొమాలు కలిగి ఉండగా, ఒక ఎమ్మెల్యే తనను తాను కేవలం "అక్షరాస్యుడు" అని ప్రకటించుకున్నారు.

గెలుపొందిన ఎమ్మెల్యేల్లో 44 మంది (49 శాతం) తమ వయస్సు 25- 50 సంవత్సరాల మధ్య ఉన్నదని ప్రకటించుకోగా.. 46 మంది (51 శాతం) 51-80 సంవత్సరాల మధ్య ఉన్నట్టు వివరించారు. అహివారా (ఎస్సీ) స్థానం నుంచి ఎన్నికైన బీజేపీకి చెందిన దోమన్‌లాల్ కోర్సేవాడ (75) కొత్తగా ఎన్నికైన అసెంబ్లీలో అధిక వయసున్న ఎమ్మెల్యేగా కాగా.. కాంగ్రెస్‌కు చెందిన బిలాయిగఢ్ (ఎస్సీ) శాసనసభ్యురాలు కవితా ప్రాణ్ లహ్రే (30) అందరికంటే పిన్న వయస్కులు కావటం గమనార్హం.

1,893 గ్రామాల్లో పంచాయతీ భవనాల్లేవ్ !

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో 1,893 గ్రామాలకు సొంత పంచాయతీ భవనాలు లేవని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ తెలిపారు. రాజ్యసభలో వైసిపి ఎంపి వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఎపిలో 13,325 గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో 1,893 గ్రామాలకు సొంత పంచాయతీ భవనాలు లేవని తెలిపారు. అలాగే 2023-24లో ఇప్పటి వరకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియన్ (ఆర్‌జిఎస్‌ఎ), 15 ఆర్థిక సంఘం నిధులు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని తెలిపారు. 2022-23లో రూ.393.92 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. గతేడాది కూడా ఆర్‌జిఎస్‌ఎ నిధులు విడుదల చేయలేదని తెలిపారు. దేశంలో 6,64,448 గ్రామాలుండగా, అందులో 2,69,073 గ్రామ పంచాయతీలు(జిపి), గ్రామీణ స్థానిక సంస్థలు (ఆర్‌ఎల్‌బి) ఉన్నాయని, 2,33,634 గ్రామ పంచాయతీల్లో సొంత భవనాలు ఉన్నాయని మరో ప్రశ్నకు తెలిపారు.

కేంద్రంలో పేరుకుపోతున్న 'ఉపాధి' బకాయిలు

- రాష్ట్రానికి వేతన బకాయిలే రూ.110.56 కోట్లు
- సకాలంలో ఇవ్వకుండా వంచిస్తున్న మోడీ సర్కార్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తూనేవుంది. ఉపాధి హామీ చట్టం ప్రకారం ఈ పథకానికి నిధులు సమకూర్చాల్సిన కేంద్ర ప్రభుత్వం కనీసం ఉపాధి కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలకు సంబంధించిన డబ్బులు కూడా ఇవ్వడం లేదు. దీంతో యేటికేడూ కేంద్రం ప్రభుత్వం 'ఉపాధి' బకాయిలు పేరుకుపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు రూ.110.56 కోట్ల ఉపాధి హామీ వేతనాల బకాయిలు ఉన్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. బుధవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 నవంబర్ 29 వరకు ఎపికి రూ.110.56 కోట్లు వేతనాలకు సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు రూ.10.96 కోట్లు బాకాయిలు ఉన్నాయని తెలిపారు.




ఉపాధి పనులు (ఫైల్)

రూపాయి కూడా విదిల్చని కేంద్రం : విజయసాయిరెడ్డి

ఆంధ్రప్రదేశ్‌కు 15వ ఆర్థిక సంఘం నిధులు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. వైసిపి ఎంపి వి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023-24లో ఎపికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,031 కోట్లు కేటాయించగా, అందులో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని కేంద్ర మంత్రి తెలిపారు.

కల్బుర్గి, గౌరీ లంకేష్ హత్య కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు

- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదేశాలు






బెలగావి : ప్రముఖ హేతువాద రచయితలు, సామాజిక ఉద్యమకారులైన ఎంఎం కల్బుర్గి, జర్నలిస్ట్ గౌరీ లంకేష్ హత్యలకు సంబంధించిన కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించి అత్యవసర చర్యలు తీసుకోవాల్సిందిగా మంగళవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదేశాలు జారీ చేశారు. బాధితుల కుటుంబాలు కూడా ఇదే మేరకు విజ్ఞప్తి చేశాయి. రచయిత, కన్నడ పరిశోధనా రంగంలో నిష్ణాతుడు అయిన ఎంఎం కల్బుర్గి 2015 ఆగస్టు 30న హత్యకు గురయ్యారు. ధార్వాడ్‌లోని ఆయన నివాసంలోనే ఈ హత్య జరిగింది. 2018-19లో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. "కుటుంబ సభ్యుల సాక్ష్యాధారాల విచారణ పూర్తయింది కానీ కోర్టులో విచారణ సాగుతోంది. ఇప్పటికే సుదీర్ఘ సమయం గడిచినందున ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాల్సిందిగా కల్బుర్గి భార్య ఉమాదేవి కోరారు. అందువల్ల ఇందుకు సంబంధించి అత్యవసరంగా చర్యలు చేపట్టాలి" అని ముఖ్యమంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే మూఢ నమ్మకాలపై పోరాడిన జర్నలిస్ట్ గౌరీ లంకేష్ హత్య కూడా 2017 సెప్టెంబరు 5న జరిగింది. దర్యాప్తు బృందం 18 మంది నిందితులను అరెస్టు చేసింది. 1200 సాక్ష్యాధారాలను సేకరించింది. 500 రకాల సాక్ష్యాలు, ఇతర రుజువులు అందాయి. వాటన్నింటినీ చార్జిషీట్‌లో భాగంగా కోర్టుకు అందచేశారని ముఖ్యమంత్రి మరో ప్రకటనలో తెలిపారు. 2022 జులైలో కోర్టు విచారణ ప్రారంభించింది. కానీ ఇతర కేసులు చాలా పెండింగ్‌లో వుండడంతో కోర్టులో విచారణ మందగమనంతో సాగుతోందని ఆ ప్రకటన పేర్కొంది. ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి, కేసును విచారించేందుకు పూర్తి స్థాయి న్యాయమూర్తిని నియమించాల్సిందిగా గౌరీ లంకేష్ సోదరి కవితా లంకేష్ కోరారని ముఖ్యమంత్రి ప్రకటన తెలిపింది.

జమ్మూకాశ్మీర్ బిల్లులకు లోక్‌సభ ఆమోదం

- పిఓకె భారతదేశానిదే
- అక్కడ 24 స్థానాల్ని రిజర్వ్ చేశాం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్ షా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ జమ్మూ కాశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు, జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లులను లోక్‌సభ ఆమోదించింది. జమ్మూకాశ్మీర్‌లో 83 అసెంబ్లీ సీట్లు ఉండగా వాటిని 90కి పెంచుతున్నట్లు బిల్లులో పేర్కొన్నారు. ఎస్సీలకు 7 సీట్లు, ఎస్టీలకు 9 సీట్లు రిజర్వ్ చేయనున్నట్లు తెలిపారు. బిల్లుపై జరిగిన చర్చలో వివిధ పార్టీల ఎంపిలు మాట్లాడారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఓకె) భారతదేశానికి చెందిందేనని అన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కారణంగా జమ్మూకాశ్మీర్ రెండు తప్పుల్ని చవిచూసిందని ఆయన ఆరోపించారు. నెహ్రూ సరైన చర్యలు తీసుకొనివున్నట్లయితే పిఓకె భారత్‌లో భాగమై ఉండేదన్నారు. 'రెండు పొరపాట్ల కారణంగా జమ్మూకాశ్మీర్ తీవ్రంగా నష్టపోయింది. మొదటిది.. పాక్‌తో యుద్ధంలో మన సైన్యం గెలుస్తున్నప్పుడు 'కాల్పుల విరమణ' విధించడం. ఆ యుద్ధాన్ని మరో రెండుమూడ్రోజులు కొనసాగించి, ఆ తరువాత కాల్పుల విరమణ పాటించివుంటే పిఓకె దేశంలోనే ఉండేది. రెండోది.. మన అంతర్గత సమస్యను ఐక్యరాజ్యసమితి (యుఎన్) దృష్టికి తీసుకెళ్లడం' అని నెహ్రూ తీరుపై ఆరోపణలు గుప్పించారు. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాద సంఘటనలు చోటు చేసుకోకుండా చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని, 2026 నాటికల్లా ఆ విషయంలో విజయం సాధిస్తామని చెప్పారు. ఇంతకుముందు కాశ్మీర్ డివిజన్‌లో 46, జమ్మూ డివిజన్‌లో 37 స్థానాలు ఉండేవి.. తాజా బిల్లులో కాశ్మీర్‌లో 47, జమ్మూలో 43కు అసెంబ్లీ స్థానాల్ని పెంచినట్టు అమిత్ షా వెల్లడించారు. పిఓకెను కూడా దేశ భూభాగంగా పరిగణించి అక్కడ 24 స్థానాల్ని రిజర్వ్ చేసినట్లు మంత్రి ప్రకటించారు. అయితే కేంద్ర హోంమంత్రి రాజకీయ ప్రసంగం చేయడం, నెహ్రూపై వివాదస్పద వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాల సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరాటం

అంబేద్కర్‌కు అదే నిజమైన నివాళి

- సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడటమే రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం నాడిక్కడ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు), దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్‌ఎంఎం) ఆధ్వర్యంలో సభ జరిగింది. తొలుత అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి, పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సభలో సీతారాం ఏచూరి మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం, అణగారిన ప్రజల పురోగతి కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను మంట గలుపుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యంపైనా, రాజ్యాంగంపైనా దాడికి పూనుకుంటోందని ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. అణగారిన ప్రజలకు, మహిళలకు వ్యరేకమైన మనువాద స్మృతిని తీసుకురావాలని మోడీ సర్కార్ కుట్రలు చేస్తోందని ఆయన విమర్శించారు. దేశంలో పేదరికం పోవాలంటే పేదలకు భూపంపణి చేయాలని అంబేద్కర్ కోరుకున్నారని ఏచూరి గుర్తు చేశారు. కానీ నేడు బిజెపి భూములను, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు ధారదత్తం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మతోన్మాదానికి, కార్పొరేట్ వర్గాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్, ప్రొఫెసర్ రమేష్ చంద్ర, అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు హన్నన్ మొల్లా, డిఎస్‌ఎంఎం నాయకులు నత్తు ప్రసాద్, ఎఐడిఆర్‌ఎం నేత నిర్మల్ తదితరులు ప్రసంగించారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పిస్తున్న ఏచూరి, వెంకట్ తదితరులు

ఢిల్లీ మత ఘర్షణల కేసులో వ్యక్తిగతంగా హాజరవ్వండి

- ఇడి ప్రత్యేక డైరెక్టర్‌కు ఢిల్లీ కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో 2020లో చోటుచేసుకున్న మత ఘర్షణలకు సంబంధించిన కేసులో ఈ నెల 8న జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రత్యేక డైరెక్టర్‌కు ఢిల్లీ అడిషనల్ సెషన్స్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును ఇడి విచారణ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే మంగళవారం కోర్టుకు విచారణకు ప్రాసిక్యూషన్ లాయర్లు హాజరు కాకపోవడంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు దాదాపు 30 నిమిషాల పాటు వేచి చూసినా. ప్రాసిక్యూషన్ తరపున ఎవ్వరూ హాజరు కాలేదని అదనపు సెషన్స్ జడ్జి అమితాబ్ రావత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ పరిస్థితుల్లో ఇడి స్పెషల్ డైరెక్టర్ తదుపరి విచారణ తేదీ అంటే డిసెంబర్ 8 మధ్నాహ్నం 2 గంటలకు వ్యక్తిగతంగా హాజరుకావాలి' అని జడ్జి ఆదేశించారు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. మత విద్వేషంతో రగిలిపోయిన కాషాయ మూకలు స్థానిక ప్రజలపైనా, విశ్వవిద్యాలయాల్లోకి చొరబడి విద్యార్థులపైనా దాడులు సాగించాయి. అయితే శాంతియుత నిరసనలకు హింసను అంటగట్టి మైనార్టీలపై మరింత విద్వేషాన్ని రాజేంసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పెద్దలు కుయుక్తులు పన్నారని సర్వత్రా విమర్శలు కూడా వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇడిని రంగంలోకి దింపిన కేంద్ర ప్రభుత్వం మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని దాడులను చేయించిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలోనే ఢిల్లీ ఘర్షణలకు ఆజ్యం పోయడానికి డమ్మీ కంపెనీలను ఉపయోగించి అనేక కోట్ల రూపాయలను ఆప్ మాజీ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్ మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలపై ఇడి విచారణ చేస్తోంది. ఈ కేసుపై కోర్టులో విచారణ జరగగా..ఇడి తరుపునే ప్రాసిక్యూషన్ న్యాయవాదులు గైర్హాజరవ్వడం గమనార్హం.

వరద ముంపులోనే చెన్నయ్

చెన్నయ్ : మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాల కారణంగా చెన్నయ్ ఇంకా వరద ముంపులోనే ఉంది. బుధవారం కూడా నగరంలోని అనేక ప్రాంతాలు వరద నీటిలోనే ఉన్నాయి. దీంతో గురువారం కూడా పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. చెన్నయ్ జిల్లాలో ఈ నెల 4 నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కొనసాగుతున్నాయి. నగరం అంతటా వరద సహాయక చర్యలు జరుగుతున్నందున విద్యార్థుల క్షేమం కోసం విద్యా సంస్థలను మూసివేస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వరద బాధితుల కోసం నగరంలోని అనేక పాఠశాలలను పునరావాస, సహాయక కేంద్రాలుగా నిర్వహిస్తున్నారు. మిచౌంగ్ తుపాను కారణంగా భారీ వర్షాలతో అల్లకల్లోలమైన చెన్నయ్ పరిసర ప్రాంతాల్లో 17 మంది చనిపోయారు. వేలాది కోట్ల రూపాయాల మేర పంట, ఆస్థి నష్టం వాటిల్లింది. కనీసం రూ.5వేలు కోట్లు ఆర్థిక సాయం అందజేసే ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కోరారు.

బాధితుల కోసం ప్రార్థనలు : మోడీ

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరిలో తుపాను వల్ల నష్టపోయిన వరద బాధితుల కోసం తాను ప్రార్థనలు చేస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో అనేక మంది తమ కుటుంబ సభ్యులను కోల్పోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు.

శాశ్వత కాల్పుల విరమణే పరిష్కారం

- అమెరికా ప్రజల డిమాండ్
- ప్రత్యేక సర్వేలో 61 శాతం మంది ఓటర్ల మద్దతు



గాజాలో శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అమెరికా అధ్యక్షుడి భవనం వైట్‌హౌస్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

వాషింగ్టన్ : గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని తక్షణమే విరమించాలని, శాశ్వత కాల్పుల విరమణ జరగాలని అమెరికా ప్రజానీకం అక్కడి ప్రభుత్వ పెద్దలను డిమాండ్ చేస్తున్నారు. శాశ్వత కాల్పుల విరమణతోనే గాజా సమస్యకు పరిష్కారం లభిస్తుందని నినదిస్తున్నారు. డేటా ఫర్ ప్రొగ్రెస్ సంస్థ ఈ మేరకు నిర్వహించిన ప్రత్యేక సర్వేలో 61 శాతం మంది అమెరికన్ ఓటర్లు శాశ్వత కాల్పుల విరమణకు మద్దతు తెలిపారు. కాగా కేవలం 11 శాతం మంది అమెరికా చట్టసభల సభ్యులు మాత్రమే ఇజ్రాయిల్ యుద్ధం ముగింపునకు మద్దతిస్తున్నారని ఆ సంస్థ పేర్కొంది. డెమొక్రటిక్ కాంగ్రెస్‌కి చెందిన మహిళా ప్రతినిధి రషిదా తలైబ్ ఈ పోల్ వివరాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

డెమొక్రటిక్ ఓటర్లలో 76 శాతం మంది కాల్పుల విరమణకు మద్దతిస్తున్నారని చెప్పారు. ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరు ఇజ్రాయిల్‌కు ఆయుధాలు పంపేందుకు, అదనపు సైనిక సాయం అందించేందుకు అనుకూలంగా ఓటు వేశారు. కేవలం 11 శాతం మంది ప్రజలు మాత్రమే ఇజ్రాయిల్ బలగాలకు సాయంగా అమెరికా సైనికులను పంపడం ప్రాధాన్యతా చర్యగా ఎంపిక చేసుకోవాలని భావించారని పేర్కొంది. దాదాపు సగం మంది సభ్యులు దౌత్యపరమైన ప్రయత్నాలు జరగాలని కోరుతున్నారు. కేవలం 11శాతం మంది మాత్రమే గాజాలో ఇజ్రాయిల్ బలగాలను అదనంగా మోహరించేందుకు అమెరికాకు మద్దతిచ్చారు.

పాలస్తీనియన్ అమెరికన్ కాంగ్రెస్ సభ్యురాలైన తలైబ్‌ను నవంబరు 7న అమెరికా ప్రతినిధుల సభ అభిశంసించింది. ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధంలో కాల్పుల విరమణ జరగాలంటూ కొద్ది మంది చట్టసభల సభ్యులు మాత్రమే డిమాండ్ చేయడాన్ని ఆమె విమర్శించారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి అమెరికాలో యూదు కమ్యూనిటీలు, అరబ్బులు, ముస్లింలు పట్ల విద్వేషం పెరుగుతుండడంపై మెజారిటీ సభ్యులు ఆందోళన చెందుతున్నారని డేటా ఫర్ ప్రొగ్రెస్ సర్వే పేర్కొంది. ఈ విద్వేషాన్ని యూదు వ్యతిరేకతతో సమం చేస్తూ అమెరికా ప్రతినిధుల సభ ఒక బిల్లును మంగళవారం ఆమోదించింది. కాగా పాలస్తీనా హక్కుల సంస్థ ఈ చర్యను ప్రమాదకరమైనదిగా అభివర్ణించింది. భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడానికి ఉద్దేశించిన చర్యగా పేర్కొంది. గాజాలో ఇజ్రాయిల్ సైనిక చర్యను 45 శాతం మంది విభేదించారని గాలప్ నిర్వహించిన పోల్ పేర్కొంది. ప్రస్తుతం ఇజ్రాయిల్-హమస్ పరిస్థితుల పట్ల బైడెన్ వ్యవహరిస్తున్న తీరును 32శాతం మంది ఆమోదించారని తెలిపింది.

ఎసెక్విబో వెనిజులా హక్కు : మదురో



కారకస్ : వెనిజులాకు సహజసిద్ధ సరిహద్దుగా ఉన్న ఎసెక్విబా ప్రాంతం తమ హక్కు అని వెనిజులా అధ్యక్షులు నికొలస్ మదురో అన్నారు. గుయానా ఆక్రమించిన ఈ ప్రాంతం తమదేనని చెబుతూ బిల్లును రూపొందించినున్నట్లు ఆయన తెలిపారు. 'గుయానా ఎసెక్విబా' ప్రావిన్స్‌ను ఏర్పాటు చేసేందుకు బిల్లును రూపొందించాలంటూ అధికారులకు ఆయన ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే ఆ ప్రాంతంలోకి ప్రవేశించి శిలాజ ఇంధనాలను, ఖనిజాలను అన్వేషించడానికి సిద్ధపడాల్సిందిగా వెనిజులా మైనింగ్ సంస్థలకు సూచించారు. ఎసెక్విబో ప్రాంతంలో చమురు, గ్యాస్, ఖనిజాలు అన్వేషించేందుకు లైసెన్సులు మంజూరు చేస్తానని మదురో చెప్పారు. ఈ ప్రాంతంలో తవ్వకాలు చేస్తున్న గుయానా కంపెనీలు మూడు నెలల్లోగా అక్కడ నుండి వెళ్ళిపోవాలని హెచ్చరించారు. శిలాజ ఇంధనాలు, ఖనిజ నిక్షేపాలు కలిగియున్న ఎసెక్విబో ప్రాంతం తమదేనంటూ దశాబ్దాల తరబడి వెనిజులా చెబుతూ వస్తోంది. ఆ ప్రాంతంలో తూర్పున గల ఎస్క్విబో నది తమకు సహజసిద్ధమైన సరిహద్దుగా వుందని, అందువల్ల దీన్ని చారిత్రకంగా తమ ప్రాంతంగా గుర్తించినట్లు వెనిజులా చెబుతోంది. ఎసెక్విబో ప్రాంతంలో 8 లక్షల మంది జనాభా ఉండగా..మూడింట రెండింతలు 1.25 లక్షల మంది జనాభా ఉన్న ప్రాంతాన్ని గుయానా ఆక్రమణలో ఉంది. అయితే వెనిజులా వాదనను గుయానా అధ్యక్షులు ఇర్ఫాన్ అలీ ఖండించారు. ఈ కేసును ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి తీసుకెళతానని హెచ్చరించారు.

ఎలక్ట్రానిక్ పరికరాల స్వాధీనంపై మార్గదర్శకాలేవీ ?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం
- అస్పష్టత కొనసాగడంపై అసహనం
- 90 మంది జర్నలిస్టుల నుండి 300 పరికరాలు : కేంద్రం

న్యూఢిల్లీ : విద్యావేత్తలు, మీడియా సిబ్బంది నుండి మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లతో సహ వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్న సందర్భాల్లో అనుసరించేందుకు మార్గదర్శకాలను రూపొందించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇంకా అస్పష్టతతోనే వుంది. దాదాపు రెండేళ్ళ నుండి ఈ మార్గదర్శకాలను రూపొందించడంలో ప్రభుత్వం మౌనంగా వ్యవహరిస్తోందని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. 'ఎప్పుడు మార్గదర్శకాలతో మీరు వస్తారు?" అని జస్టిస్ కౌల్ కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజును ప్రశ్నించారు. దీనిపై కమిటీ కసరత్తు చేస్తోందని, వచ్చే వారానికల్లా తమకు మార్గదర్శకాలు అందవచ్చని రాజు చెప్పారు. తనకు ఆరోగ్యం బాగా లేనందున దీనిపై పురోగతి తెలియదని చెప్పారు. దాంతో డిసెంబరు 14కి కేసు విచారణను వాయిదా వేశారు. వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకోరాదని, వాటిని నిరవధికంగా దర్యాప్తు సంస్థల అధీనంలో వుంచుకోరాదని పిటిషనర్లు తరపున సీనియర్ న్యాయవాదులు నిత్యా రామకృష్ణ, ప్రసన్నలు పేర్కొన్నారు. కావాలంటే ఆ పరికరాల్లోని సమాచారాన్ని కాపీ చేసుకోవాలన్నారు. ప్రతిపాదిత మార్గదర్శకాలకు తాము విడిగా తమ సూచనలు అందచేశామని చెప్పారు.


దాదాపు 90 మంది జర్నలిస్టుల నుండి 300 పరికరాలను స్వాధీనం చేసుకున్నారని, అందువల్ల దీనిపై తక్షణమే దృష్టి పెట్టాల్సిన అవసరముందని చెప్పారు. 'ఎవరైనా మీ ఇంటికి వచ్చి మీ వస్తువులు స్వాధీనం చేసుకుని, మీ లేఖలు చదివితే మీకెలా వుంటుంది. జర్నలిస్టుల స్వేచ్ఛపై పూర్తి స్థాయిలో దాడి ఇది" అని నిత్యా రామకృష్ణ వాదించారు. తమ డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకోవడం తమ గోప్యతా హక్కును ఉల్లంఘించడమే అవుతుందని విద్యావేత్తలు, మీడియా సిబ్బంది విమర్శిస్తున్నారు. తమ జీవిత కాలంలో చేసిన కృషి అంతా ఇలాంటి సంఘటనల వల్ల పోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల న్యూస్‌క్లిక్ కార్యాలయంపై, జర్నలిస్టులపై దాడి కేసు, పెగాసస్ కేసుల నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. జర్నలిస్టుల ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడానికి వ్యతిరేకంగా నిబంధనలు, విధి విధానాలు రూపొందించే విషయంలో తక్షణమే జ్యుడీషియల్ జోక్యం చేసుకోవాలని కోరుతూ 16 మీడియా సంస్థలు భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసిన సంగతి విదితమే.

(మొదటి పేజీ తరువాయి)

వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రుణమాఫీ చేసి, రెండో పంటకు కావలసిన విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని కోరారు. బాపట్ల జిల్లాలో తుపాను ముంపు ప్రాంతాల్లో పర్యటనలో ఆయన మాట్లాడుతూ తుపాను ఎక్కడ తీరం దాటుతుందో ముందే తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదన్నారు. మురుగు కాలువలను బాగు చేసే పరిస్థితి లేకపోవడంతో వరద నీరు దిగువకు వెళ్లే వీలులేక పంట పొలాల మీదుగా ప్రవహించడంతో పంటలకు అపార నష్టం వాటిల్లిందని తెలిపారు. ధాన్యానికి ప్రయివేట్ మార్కెట్ రూ.1700 ధర ఉంటే, కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.1,650 ప్రకటించడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు తోడుగా మరో రూ.400 బోనస్ ఇచ్చి కొనాలని డిమాండ్ చేశారు. కరువు, తుపానుతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, కౌలు చెల్లించే పరిస్థితిలో లేరని తెలిపారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక పథకం తేవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తాడేపల్లిలో ఉండి సమీక్షలు చేయడం కాకుండా పొలాల్లోకొచ్చి ప్రత్యక్షంగా రైతుల కష్టాలను చూడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం బృందాలను పంపి రూ.10 వేల కోట్లయినా రైతులకిచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రెండో పంట సాగు కోసం అవసరమైన మొక్కజొన్న, మినుము, పెసర లాంటి విత్తనాలకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉచితంగా ఇవ్వాలని కోరారు. తుపాను, భారీ వర్షాలతో జగనన్న కాలనీలన్నీ నీట మునిగాయని, కాలనీవాసులు బయటకు రావాలంటే పడవలు పంపాల్సిన పరిస్థితి ఉందన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు, నెల్లూరు జిల్లా కార్యదర్శి

కళ్లెదుటే పంట నీటిపాలు



నరుకూరులో నీటమునిగిన వరిపంటను పొలంలో దిగి పరిశీలిస్తున్న సిపిఎం బృందం



మొవ్వ మండలం వీరాయలంక గ్రామంలో వరిని పరిశీలిస్తున్న సిపిఎం బృందం.

మూలం రమేష్‌లతో కూడిన బృందం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు పట్టణంలోనూ, టిపి గూడూరు మండలం నరుకూరు ప్రాంతంలోనూ పర్యటించింది. తుపాన్ కారణంగా దెబ్బతిన్న నారుమళ్లు, వరి నాట్లను, మొక్కజొన్న చేలను రైతులతో కలిసి పొలంలోకి దిగి పరిశీలించింది. నెల్లూరు పట్టణంలోని వెంకటేశ్వరపురం, గాంధీ గిరిజన కాలనీ, భగత్ సింగ్ కాలనీల వాసులు తమను ఎవరూ ఆదుకోలేదని, కనీసం కరెంట్, మంచినీటి సదుపాయం లేదని, ఆహారం కూడా అందలేదని ఈ బృందం వద్ద ఏకరువు పెట్టారు. డ్రెయినేజీ, రోడ్లు కనీసం సదుపాయాలు లేనికారణంగా ప్రతిసారీ ఇబ్బందులు పడుతున్నామని ఆర్‌డిఎఫ్ కాలనీ, జక్కా వెంకయ్య, ఇందిరమ్మ కాలనీలతోపాటు, కొత్తూరులోని వైఎస్ నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తుపాను బాధితులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు.

కృష్ణా జిల్లాలోని మొవ్వ మండలం నిడుమోలు శివారు వీరాయలంక, గూడూరు మండలం తరకటూరు, మోపిదేవి మండలం మోపిదేవి, మోపిదేవిలంక తదితర ప్రాంతాల్లో తుపానుకు దెబ్బతిన్న పంటలను, మచిలీపట్నంలోని ఇంజనీరింగ్ కాలేజీలో పునరావాస శిబిరంలో వలస కార్మికులకు అందుతున్న సౌకర్యాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబుతో కూడిన బృందం పరిశీలించింది. నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎన్యుమరేషన్ జరపాలని వై.వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతు, కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలి : ఎపి రైతు సంఘం డిమాండ్

పంటలన్నింటినీ మిచౌంగ్ తుపాను ముంచి వేసిందని, నష్టపోయిన ప్రతి రైతు, కౌలు రైతుకు నష్టపరిహారం అందించాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేసింది.

ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. వెంటనే ఎన్యుమరేషన్ చేపట్టాలని, తడిసిన ధాన్యాన్ని నిబంధనలతో పక్కనబెట్టి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, ఆహార పంటలకు ఎకరాకు రూ.25 వేలు చొప్పున, వాణిజ్య పంటలకు రూ.50 వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పంటల బీమా పరిహారం ఇవ్వాలని, పేద రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఒక నెలకు ఉచితంగా రేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మీకోసం

పట్టుచీరలు ఉతికేటప్పుడు బకెట్‌లో కొంచెం నిమ్మరసం వేయడం వల్ల రంగు పోవు.

జీవన సౌరభం

భయపడడం ఎప్పుడు మానేస్తామో.. అప్పుడే మన జీవితం మొదలైనట్లు

చిలుక చెప్పిన పాఠం




ఒకరోజు శీనుగాడు విచారంగా గుమ్మం మీద కూర్చున్నాడు. 'ఏమైందిరా శీను అలా ఉన్నావు' అని అడిగింది పెద్దమ్మ. 'ఏం లేదు' అని ముఖం తిప్పేసుకున్నాడు శీను. 'జామ పళ్ళు తిందువుగాని రా!' అని పెరట్లో ఉన్న జామచెట్టు దగ్గరికి తీసుకువెళ్ళింది. ఆ చెట్టుమీద ఉన్న చిట్టి చిలకమ్మ శ్రీనుని చూడగానే 'తియ్యని జామ పండు ఇస్తాను తింటావా' అని అడిగింది. మాట్లాడే చిలుకను చూసి ఆశ్చర్యపోయాడు శీను. చిలుక శ్రీనుకి ఎన్నో కబుర్లు చెప్పింది. పాటలు నేర్పింది. అలా వారిద్దరి మధ్య స్నేహం చిగురించింది.

ఒకరోజు సాయంత్రం బడి నుంచి ఏడుస్తూ పెద్దమ్మ ఇంటికి వచ్చాడు శీను. అది చూసిన చిలుకమ్మ 'ఎందుకు ఏడుస్తున్నావు శీను?' అని అడిగింది. 'బడిలో చెప్పిన పాఠాలు అర్థం కావడం లేదు, లెక్కలు అంటే భయం వేస్తోంది' అని చెప్పాడు. 'ఓస్ అంతేనా? ఆ మాత్రం దానికే ఏడుస్తూ కూర్చుంటే చదువు వస్తుందా?' అంటూ పాటలతో పాఠాలు చెప్పడం మొదలుపెట్టింది. ఆటలతో లెక్కలు నేర్పింది. వేళ్ళ మీద ఎక్కాలు చెప్పింది. కాకి తెచ్చిన ఆకులతో, కోతి తెచ్చిన పళ్ళతో, ఉడుత ఇచ్చిన విత్తనాలతో నేలమీద అక్షరాలు రాయించింది. పదే పదే వల్లె వేయించి పద్యాలను కంఠస్థం చేయించింది. ఆనందంగా ఆడుతూ పాడుతూ ఆసక్తిగా నేర్చుకున్నాడు. కొన్నాళ్ళకి శీనుగాడికి లెక్కలంటే భయం పోయింది. చదువు మీద ఆసక్తి పెరిగింది. శీను ధైర్యంగా బడికి వెళ్ళాడు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విన్నాడు. వారు అడిగే ప్రశ్నలకు తడుముకోకుండా సమాధానాలు చెప్పాడు. తరగతిలో ప్రథముడిగా నిలిచాడు.

శ్రీను తెలివికి ఉపాధ్యాయులంతా ఆశ్చర్య పోయారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పెద్దమ్మ పెరట్లో చెట్టు మీద ఉన్న చిలుకమ్మ చెంతకు చేరారు. ఆటపాటల ద్వారా చెప్పే చిలకమ్మ పాఠాలు విన్నారు. అందులో ఉన్న గమ్మత్తుని గ్రహించారు. పాఠశాలలో విద్యార్థులకు ఆటపాటల ద్వారా బోధన చేశారు. పిల్లలంతా ఎగిరే పక్షుల్లా, రంగు రంగుల సీతాకోక చిలుకల్లా, గల గలపారే సెలయేరులా, హరివిల్లులా హాయిగా, స్వేచ్ఛగా, ఆనందంగా నేర్చుకున్నారు. ఆకాశమే హద్దుగా ఆలోచించడం మొదలు పెట్టారు. ఎగిరే గాలిపటంలా ఊహలకు రెక్కలు తొడిగారు. ప్రతి సాయంత్రం పెద్దమ్మ ఇంట్లో చెట్టుకింద కూర్చుని చిలుకమ్మ చెప్పిన కథలు వింటూ, పాటలు పాడుతూ, పిల్లలంతా సరదాగా గడిపారు. శీనులో మార్పుని చూసి పెద్దమ్మ పొంగిపోయింది.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు, 94945 24445.

నేను గీసిన బొమ్మ





ఎస్. సాదిఖ్, 4వ తరగతి, ఎంపిఎల్‌పిఎస్ ప్యాలెస్ కాంపౌండ్, పుంగనూరు, చిత్తూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అందమైన జ్ఞాపకమే ఆదాయమైంది...

చిన్నప్పటి ఎన్నో తీపి గుర్తులు కాలగర్భంలో కలిసిపోతాయి. బాల్యం చూసిన మరెన్నో జ్ఞాపకాలు మది లోతుల్లో మరుగునపడతాయి. ఎప్పుడో ఒకప్పుడు.. ఏదో ఒక సందర్భంలో ఆ గుర్తులో.. ఆ జ్ఞాపకాలో పలకరిస్తే.. వాటి చుట్టూనే మన జీవితం అల్లుకోగలమా? అలా ఎంతమందికి సాధ్యమవుతుంది? అయితే బీహార్‌కి చెందిన నమితా ఆజాద్ గురించి తెలుసుకుందాం. చిన్నతనంలో తను చూసిన 'కన్యాపుత్రి' అనే చేతితో తయారుచేసే అందమైన బొమ్మల సాంప్రదాయం అనుకోకుండా ఆమె జీవితంలో మరొక్కసారి తారసపడింది. విధి నిర్వహణలో భాగంగా కళారూపాల శిక్షణలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె ఈసారి తన బాల్య గుర్తులకు ఆధునిక సొగసులద్ది, కళను విస్తృత పరచటమే కాక, ఆదాయ మార్గంగా మలుచుకుంటున్నారు.



బీహార్ చంపారన్ జిల్లా మంఝిరియా గ్రామంలో నజీమా బాల్యం గడిచింది. అప్పుడు తన ఇంటి చుట్టుపక్కల వాళ్లందరూ 'కన్యాపుత్రి' బొమ్మల రూపకల్పన చేసేవారు. 'అమ్మాయిలు, అమ్మలు, అమ్మమ్మలు ఇలా ఇంట్లో ఉన్న ఆడవాళ్లందరూ తయారుచేసేవారు. మా ఇంట్లో కూడా అదే వాతావరణం ఉండేది. అయితే ఇవన్నీ విక్రయించే బొమ్మలు కాదు. ఓ సాంప్రదాయం కోసం వాటిని తయారుచేసేవారు' అని ఈ బొమ్మల కథేంటో చెబుతున్నారు నజీమా.



'కన్యాపుత్రి' వెనుక కథ ఏంటంటే..

'అక్కడ ప్రతి వర్షాకాలం దర్జీల వద్ద వృధాగా ఉన్న దుస్తుల పీలికలను సేకరించి వాటితో అందమైన బొమ్మలు తయారు చేయడం ఆనవాయితీ. సోదరుల కోసం సోదరీమణులు తయారుచేసిన ఈ బొమ్మలను ఆ తరువాత, దగ్గర్లోని చెరువులో ముంచేవారు. అక్కడే ఉన్న సోదరులు ఆ బొమ్మలను తీసుకుని తిరిగి సోదరీమణులకు ఇవ్వడం సాంప్రదాయం. బొమ్మ తెచ్చినందుకు కృతజ్ఞతగా సోదరీసోదరులు ఒకరికొకరు మిఠాయిలు పంచుకునేవారు. ఇది అన్నాచెల్లెళ్ల అనుబంధానికి గుర్తుగా చేసేవారు. ఆ తరువాత ఈ బొమ్మలు వివాహ సమయంలో కూడా ప్రత్యేకంగా నిలిచేవి. నా చిన్నప్పుడు మా ఇంటికి వచ్చిన కొత్తకోడలు తనతో పాటు ఈ బొమ్మలను తీసుకురావడం నాకు బాగా గుర్తు' అని నజీమా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

గ్రామంలో ఇలా ఎన్నో మధుర జ్ఞాపకాలను భద్రపరచుకున్న నజీమా తండ్రి ఉద్యోగరీత్యా కొన్నేళ్లకు గ్రామం విడిచారు. తన విద్యాభ్యాసమంతా నగరంలోనే సాగింది. అయితే చిన్నతనంలో కళల పట్ల ఏర్పడిన మక్కువతో ఎంఎ సైకాలజీ చేసిన నజీమా, ఛండీగఢ్ ప్రాచీన కళా కేంద్రంలో ఆర్ట్స్, క్రాఫ్ట్స్‌లో మాస్టర్ చేశారు.


ఆ బొమ్మల కోసం నా కళ్లు వెతికేవి..

చదువు, ఉద్యోగ బాధ్యతల్లో తలమునకలై ఉన్న నజీమా తన చుట్టూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ బొమ్మల మధ్య 'కన్యాపుత్రి' బొమ్మల ఆనవాళ్ల కోసం వెతికేవారు. బంధువుల ఇళ్లు, పెళ్లిళ్లలో ఆ బొమ్మల రూపాల కోసం ఆమె కళ్లు చూసేవి. 'ఎక్కడా ఆ ఆనవాళ్లు కనిపించలేదు. సాంప్రదాయం కనుమరుగైపోయిందని భావించాను. ఉద్యోగరీత్యా బొమ్మల రూపంలో పిల్లలకు పాఠాలు ఎలా చెప్పాలో టీచర్లకు శిక్షణ ఇచ్చేదాన్ని. ఒకసారి కుటుంబం, బంధాలు, పాఠం గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు ఈ కన్యాపుత్రి బొమ్మలతో ఎలా చెప్పవచ్చో ఆలోచించాను. అమ్మ సాయంతో వాటిని తయారుచేశాను. అవి ఎంతోమందికి నచ్చాయి. వాటిని తయారుచేయడం నేర్పించమని టీచర్లు అడిగేవారు. అలా 2013లో ఈ బొమ్మలను నేర్చుకునేందుకు ఓ టీచర్ ముందుకు వచ్చారు. ఆమె ఆసక్తి చూసి నేను కూడా ఉద్యోగాన్ని వదిలేసి పూర్తికాలం బొమ్మల రూపకల్పనలో మునిగిపోయాను' అని తన ప్రయాణం గురించి చెప్పారు నజీమా.

'క్రాఫ్ట్ ఎన్ క్రియేషన్స్' రూపకల్పన

పాట్నా కేంద్రంగా 'క్రాఫ్ట్ ఎన్ క్రియేషన్స్' ప్రారంభించిన నజీమా, ఆమె బృందం తయారుచేసిన ఈ కళారూపాలు ఇప్పుడు చంపారక్ జిల్లాలోనే కాదు దేశ నలుమూలలకు వ్యాప్తి చెందాయి. ఇద్దరితో ప్రారంభమైన ఈ బొమ్మల కేంద్రంలో ఇప్పుడు పదుల సంఖ్యలో ఉన్నారు. వారంతా మహిళలే. చేతితో తయారుచేసే ఈ కళారూపాలను వివిధ ఆకృతులలోనే కాక, సమాజానికి సందేశం ఇచ్చేలా తయారుచేయడంలో నజీమా విజయం సాధిస్తున్నారు.

ఉమ్మడి కుటుంబాలు, అన్నాచెల్లెళ్లు, గర్భిణీలకు, పిల్లలకు పోషకాహారం ఆవశ్యకత, జంతువులు, పక్షులు, పెళ్లి కూతురు, పెళ్లి కొడుకు వంటి నజీమా తయారుచేసిన బొమ్మలు రాష్ట్రంలో ఆమెను ప్రత్యేక వ్యక్తిగా నిలిపాయి. రూ.100 నుండి రూ.5000 వరకు పలికే ఈ బొమ్మల ధర అందరికీ అందుబాటులో ఉండడంతో, ప్రభుత్వ సంస్థలు, ఎగ్జిబిషన్లలో ఈ కళారూపాలకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ కృషికి గాను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం బీహార్ హ్యాండ్‌క్రాఫ్ట్ అవార్డుతో ఆమెను సత్కరించింది. 'కన్యాపుత్రి' బొమ్మలే కాదు.. అమ్మలు, అమ్మమ్మల నుండి నేర్చుకున్న నైపుణ్యాలతో మనం ఎన్నో కొత్త విషయాలను రూపొందించవచ్చు. వాటిద్వారా ఆదాయాన్ని కూడా పొందవచ్చు. ఇదే అంశంపై రాష్ట్రంలో నేను పలు శిక్షణా శిబిరాలను నిర్వహించాలని లక్ష్యం పెట్టుకున్నాను' అంటున్న నజీమా లాంటి వారు ఎంతోమందికి ఆదర్శం.



చలికాలంలో పెదవుల సంరక్షణ

శీతాకాలంలో తగిన సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పెదవులు వాడిపోతాయి. పెదవుల రంగు నల్లగా మారతాయి. ఈ కాలంలో పెదవుల సంరక్షణకు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఈ సీజన్‌లో రోజూ లిప్ బామ్ వాడటం వల్ల పెదాలు పొడిబారవు. పెదవులు ఎల్లప్పుడూ తేమగా ఉంటాయి.
- పెదవులపై చర్మం చాలా పలుచగా ఉండటం వల్ల చలికాలంలో త్వరగా పొడిబారిపోతాయి. లిప్ స్టిక్‌ను ఎక్కువగా వాడటం రాదు. లేదా వాడకుండా ఉండడం మంచిది.
- పెదవులపై తేనెను తరచూ మర్దన చేస్తూ ఉంటే ప్రయోజనం కనిపిస్తుంది. ఇది పెదవుల సహజ రంగు, మృదుత్వాన్ని కాపాడుతుంది.
- ఇంట్లో తయారు చేసిన నెయ్యి, లేదా మీగడను వాడటం కూడా మంచిదే. రాత్రి పడుకొనే ముందు పెదవులకు నెయ్యి రాసుకొని పడుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.
- ఎండలోకి వెళ్లేటప్పుడు పెదవులకు కొద్దిగా సన్‌స్క్రీన్ రాసుకోవాలి. అప్పుడు సూర్యరశ్మికి గురికావడం వల్ల పెదవుల రంగు మారదు.

12న 'హనుమాన్' ట్రైలర్



తేజ సజ్జ, ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'హనుమాన్' చిత్రం నుండి ఈ డిసెంబర్ 12న ట్రైలర్ విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. చైతన్య సమర్పణలో ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పై కె.నిరంజన రెడ్డి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. అమృతా అయ్యర్, వరలక్ష్మీ శరత్ కుమార్, వినయ్‌రాయ్, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ, హిందీ, స్పానిష్, చైనీస్, జపనీస్, కొరియన్, ఇంగ్లీష్ ఇలా 11 భాషల్లో ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది.



వేణుతో నాని 'ఎల్లమ్మ'!

'బలగం' దర్శకుడు వేణుతో నాని సినిమా చేయాలనుకుంటున్నట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. తాజా సమాచారం ప్రకారం దిల్ రాజు ఈ సినిమా నిర్మిస్తారని తెలుస్తోంది. 'బలగం' తర్వాత వేణు 'ఎల్లమ్మ' అనే టైటిల్‌తో ఒక కథ రాసుకున్నారు. ఆ కథ దిల్ రాజుకి బాగా నచ్చింది. త్వరలోనే ఈ సినిమా గురించి ప్రకటన విడుదల చేయనున్నారు. ఇదిలా ఉంటే ఈ కథ నానికి సూట్ అవుతుందని దిల్ రాజు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నాని 'హాయ్ నాన్న' సినిమా ముగించు కుని, వివేక్ ఆత్రేయతో సినిమా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆ తరువాతే వేణుతో సినిమా ఉండ నుంది. దీంతో 'ఎల్లమ్మ' కథను నానికి వినిపించి, ఆయన ఓకే అంటే వెంటనే సినిమా మొదలు పెట్టేలా దిల్ రాజు ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం.

'దూత'కు అద్భుతమైన స్పందన : శరత్‌మరార్



'దూత'తో ఓటీటీలో మాసీవ్ బ్లాక్ బస్టర్ సాధించాం. చాలా ఆనందంగా వుంది. ఈ ప్రాజెక్ట్‌ని జూన్, జులై లోనే పూర్తి చేసి ఫైనల్ కాపీ అమెజాన్‌కి ఇచ్చాం. విడుదలైన తర్వాత అన్ని వైపుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. మంచి ప్రొడక్ట్ చేశామని తెలుసు. అయితే ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన మాకు గొప్ప సంతోషాన్ని ఇచ్చింది. నాగచైతన్య, విక్రమ్.. టీం అంతా రిజల్ట్ పై చాలా ఆనందంగా ఉన్నాం. లాంగ్ ఫార్మట్ స్టోరీ టెల్లింగ్ అనేది ఇండియాలో కొత్త ఫార్మాట్. కొన్ని సిరీస్‌లు వచ్చినప్పటికీ ఇంకా కొత్త ప్రపంచంలోకి అడుగు పెడుతున్నట్లే. ఈ క్రమంలో చేసిన ప్రాజెక్ట్‌కు ప్రేక్షకులు నుంచి ఇంత మంచి స్పందన రావడం వండర్ ఫుల్ ఎక్స్ పీరియన్స్' అని డైరెక్టర్ విక్రమ్ కె.కుమార్ తెలిపారు. దూతలో అక్కినేని నాగ చైతన్య, ప్రియా భవానీ శంకర్, పార్వతి తిరువోతు, ప్రాచీ దేశాయ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై నిర్మాత శరత్ మరార్ ఈ వెబ్ సిరీస్‌ను ఈనెల ఒకటో తేదీన ప్రైమ్ వీడియోలో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో విడుదల చేసిన విషయం తెలిసిందే. అతీంద్రియ శక్తుల గురించి ఈ సినిమాలో ఎక్కువగా చూపించారు.

'హాయ్ నాన్న'తో సరికొత్త అనుభూతి

హేషమ్ అబ్దుల్ వహాబ్



"చాలా ఆనందంగా వుంది. అయితే ఇంకా చాలా నేర్చుకోవాలి. ప్రతి సినిమా ఒక పరీక్షే. ప్రతి సినిమా ఒక లెర్నింగ్ ఎక్స్ పీరియన్స్. ఇంకా కొత్తగా ఎక్స్ ఫ్లోర్ చేయాలి. ఇది కేవలం సంగీత దర్శకుడే కాదు.. దర్శకుడు, రచయిత, ఎడిటర్.. అలా అందరూ కొత్తదనం ఎలా చూపించాలనే విషయంపైనే దృష్టి పెడతారు. కథని ఎంత యూనిక్‌గా చెబుతున్నామనేది ఇక్కడ ముఖ్యం." అని అని సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ అన్నారు. గురువారంనాడు హాయ్ నాన్నా సినిమా విడుదల కానున్న సందర్భంగా ఆయన విలేకరులకు సినిమా విశేషాలను వివరించారు. "కాదల్, రోజా, బొంబాయి, ఒకే బంగారం.. ఇలా ఈ చిత్రాల థీమ్స్ సిమిలర్‌గా ఉండొచ్చు. అయితే దర్శకుడు ఆ కథని ఎలా చెప్పారనే దానిపైనే వైవిధ్యం ఆధారపడి వుంటుంది. సంగీతం కూడా అలానే వుంటుంది. ప్రేమ పాటల్ని విన్నప్పుడు ఒకే ఎమోషన్ వుంటుంది. హాయిగా, రొమాంటిక్ గా ఫీలౌతాం' అని అన్నారు. హీరో నాని వైర ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. ఈ చిత్రంతో శౌర్యువ్ దర్శకునిగా పరిచయం అవుతున్నారు. ఇందులో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రుతి హాసన్, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రల్లో కనిపించారు. ఈ చిత్రాన్ని మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు.

'ప్రేమకథ' సినిమా ట్రైలర్ విడుదల



కిశోర్ కెఎస్‌డి, దియా సితెపల్లి హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'ప్రేమకథ' ట్రైలర్‌ను హీరో విజయ్ దేవరకొండ హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ చిత్రాన్ని టాంగా ప్రొడక్షన్స్ ఎల్ఎల్ పీ, సినీ వ్యాలీ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మాతలు. ఉపేందర్ గౌడ్ ఎర్ర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శివశక్తి రెడ్ డీ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. రాజ్ తిరందాసు, వినయ్ మహదేవ్, నేత్ర సాధు తదితరులు ఈ సినిమాలో నటించారు.

'జోరుగా హుషారుగా' ట్రైలర్ విడుదల



విరాజ్ అశ్విన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'జోరుగా హుషారుగా'. ఈ చిత్రం నుండి తాజాగా ట్రైలర్‌ను విడుదలచేశారు. దర్శకుడు బుచ్చిబాబు సానా దీన్ని విడుదల చేశారు. 'బేబి సినిమాతో విరాజ్ అశ్విన్ మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. విరాజ్, పూజిత కలిసి నటించిన ఈ సినిమా కూడా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. మంచి కంటెంట్‌తో ఈ సినిమా తెరకెక్కినట్లుగా అర్థమవుతుంది. చిత్రయూనిట్ మొత్తానికి నా అభినందనలు' అని ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడారు. అను ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను శిఖర అండ్ అక్షర ఆర్ట్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై నిరీష్ తిరువిధుల నిర్మిస్తున్నారు. పూజిత పొన్నాడ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబరు 15న విడుదల కాబోతోంది.

షెఫాలీ మెరిసినా..

- తొలి టి20లో ఇంగ్లండ్ మహిళల చేతిలో ఓటమి..
- వాట్, బ్రంట్ అర్ధసెంచరీలు



ముంబయి: తొలి టి20లో ఇంగ్లండ్ మహిళల చేతిలో భారత మహిళలజట్టు పరాజయాన్ని చవిచూసింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 198పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 159పరుగులే చేయగల్గింది. అంతకుముందు టాస్ గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ తొలిగా బౌలింగ్ ఎంచుకొన్నా ఫలితం లేకపోయింది. తొలి రెండు వికెట్లను త్వరగా పెవీలియన్‌కు చేర్చినప్పటికీ ఆ తర్వాత భారత బౌలర్లు తేలిపోయారు. పూజ వస్త్రాకర్(0/44), శ్రేయాంక(2/44), ఇషాక్(1/38) నిరాశపరచడంతో ఇంగ్లండ్ బ్యాటర్స్ చెలరేగారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 197పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. తొలుత సోఫియా(1), అలీసా(0) త్వరగా ఔటైనా.. వాట్(75), బ్రంట్(77) 2వ వికెట్‌కు ఏకంగా 138పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత జోన్స్(23; 9బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్)తో ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. తొలి రెండు వికెట్లు కోల్పోయాక ఇంగ్లండ్ బ్యాటర్లు అద్భుతంగా పుంజుకొని భారీస్కోర్‌కు దోహదపడ్డారు. భారత బౌలర్లు రేణుకకు మూడు, శ్రేయాంక పాటిల్‌కు రెండు, శిఖా ఇషికాకు ఒక వికెట్ దక్కాయి.



టీమిండియా క్రికెటర్లు మంగళవారం అర్ధరాత్రి బెంగళూరులోని కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి దక్షిణాఫ్రికాకు పయనమయ్యారు

ఛేదనలో షెఫాలీ వర్మ(52) అర్ధసెంచరీ మినహా మిగతా బ్యాటర్స్ నిరాశపరిచారు. మంధాన (6), రోడ్రిగ్స్ (4) సింగిల్ డిజిట్‌కే పెవీలియన్‌కు చేరగా.. కెప్టెన్ హర్మన్(26), వికెట్ కీపర్ రిచా ఘోష్(21) ఫ ర్వాలేనిపించారు. చివర్లో లక్ష్యం భారీగా పెరిగిపోవడంతో నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి భారత్ 6వికెట్లు నష్టపోయి 159పరుగులే చేయగల్గింది. ఎక్లెస్టోన్‌కు మూడు, బ్రంట్, కెంప్, గ్లెన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బ్రంట్‌కు లభించగా.. రెండో టి20 శనివారం వాంఖడే వేదికగా జరగనుంది.

స్కోర్‌బోర్డు..

ఇంగ్లండ్ మహిళల ఇన్నింగ్స్: సోఫియా డంక్లే (బి)రేణుక సింగ్ 1, వాట్ (స్టంప్)రిచా ఘోష్ (బి)షికా ఇషికా 75, అలీసా కాప్సే (బి)రేణుక 0, స్కీవర్ బ్రంట్ (సి)రిచా ఘోష్ (బి)రేణుక సింగ్ 77, హీథర్ నైట్ (బి)శ్రేయాంక 6, అమీ జోన్స్ (సి)రోడ్రిగ్స్ (బి)శ్రేయాంక 23, కెంప్ (నాటౌట్) 5, అదనం 10. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 197పరుగులు. **వికెట్ల పతనం:** 1/2, 2/2, 3/140, 4/165, 5/1177, 6/197 **బౌలింగ్:** రేణుక ఠాకూర్ 4-0-27-3, పూజ వస్త్రాకర్ 4-0-44-0, శిఖా ఇషికా 4-0-38-1, దీప్తి శర్మ 3-0-28-0, శ్రేయాంక పాటిల్ 4-0-44-2, కనిక అహుజా 1-0-12-0

ఇండియా మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (సి)గ్లెన్ (బి)ఎక్లెస్టోన్ 52, స్మృతి మంధాన (బి)స్కీవర్ బ్రంట్ 6, జెమిమా రోడ్రిగ్స్ (సి)అమీ జోన్స్ (బి)కెంప్ 4, హర్మన్‌ప్రీత్ కౌర్ (బి)ఎక్లెస్టోన్ 26, రిచా ఘోష్ (సి)ఎలీసా కాప్సీ (బి)గ్లెన్ 21, కనిక అహుజా (సి)బ్రంట్ (బి)ఎక్లెస్టోన్ 15, పూజ వస్త్రాకర్ (నాటౌట్) 11, దీప్తి శర్మ(నాటౌట్) 3, అదనం 21. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 159పరుగులు. **వికెట్ల పతనం:** 1/20, 2/41, 3/82, 4/122, 5/134, 6/151 **బౌలింగ్:** మహికా గార్ 2-0-18-0, లారెన్ బెల్ 4-0-35-0, స్కీవర్ బ్రంట్ 4-0-35-1, ఫ్రెయా కెంప్ 2-0-30-1, సోఫియా ఎక్లెస్టోన్ 4-0-15-3, సరా గ్లెన్ 4-0-25-1.

చిత్తుగా ఓడిన టైటాన్స్

పట్నా 50-28పాయింట్లతో గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్-10

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ సీజన్-10 లోనూ తెలుగు టైటాన్స్ ఆటతీరు మారలేదు. భారత కబడ్డీ జట్టు కెప్టెన్ పవన్ షెహ్రావత్ చేరికతోనైనా మెరుగైన ప్రదర్శన కనబరుస్తుందనుకున్న ప్రేక్షకులకు మరోసారి నిరాశ తప్పలేదు. ఈ సీజన్‌లో టైటాన్స్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. బుధవారం పట్నా పైరెట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు 28-50 పాయింట్ల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. మ్యాచ్ ప్రారంభమైన తొలి ఐదు నిమిషాల్లో పట్నాపై ఆధిక్యతను సంపాదించిన టైటాన్స్.. ఆ తర్వాత వరుసగా పాయింట్లను చేజార్చుకొని మ్యాచ్‌ను కోల్పోయింది. తెలుగు టైటాన్స్ కెప్టెన్ పవన్ షెహ్రావత్(11రైడ్ పాయింట్లు)కి తోడు సందీప్ ధుల్(4డిఫెన్స్) పాయింట్లు సాధించాడు. ఇక పట్నా జట్టులో సచిన్(14), మంజీత్(8) రైడ్స్‌లో, అంకిత్(5) ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచాడు.

టి20ల్లో రవి బిష్ణోయ్‌కు టాప్ ర్యాంక్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజా ర్యాంకింగ్స్‌లోనూ భారత్ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఐసిసి బుధవారం ప్రకటించిన టి20 ర్యాంకింగ్స్‌లో భారత్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. దీంతో మూడు ఫార్మాట్‌లలోనూ టీమిండియా మరోదఫా అగ్రస్థానంలో నిలిచినట్లయ్యింది. అలాగే టీమిండియా యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్ 699 రేటింగ్ పాయింట్లతో ఏకంగా అగ్రస్థానానికి ఎగబాకాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో బిష్ణోయ్ తొమ్మిది వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచుకున్నాడు. దీంతో అతని ర్యాంక్ మెరుగై ఏకంగా అగ్రస్థానానికి దూసుకెళ్లేందుకు దోహదపడింది. 23ఏళ్ల బిష్ణోయ్.. 699 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్(692), వనిందు హసరంగ (శ్రీలంక-679), అదిల్ రషీద్(ఇంగ్లండ్-679), మహీశ్ తీక్షణ(శ్రీలంక-677) టాప్-5లో ఉన్నారు.

ముష్ఫికర్ సెల్ఫ్ అవుట్..

టెస్ట్ క్రికెట్ చరిత్రలో తొలిసారి



ఢాకా: బంగ్లాదేశ్ వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ సెల్ఫ్ ఔటయ్యాడు. న్యూజిలాండ్ బౌలర్ జేమిసన్ వేసిన బంతి బ్యాటుకు తగిలి నేలకు తాకే క్రమంలో ముష్ఫికర్ దాన్ని చేతితో అవతలి వైపునకు తోశాడు. బంతి వికెట్ల వైపునకు రాకున్నా బంతిని అడ్డుకోవడంతో న్యూజిలాండ్ క్రీడాకారులు అప్పీలు చేయడంతో థర్డ్ అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. ఇలా ఓ బ్యాటర్ ఔట్ కావడంతో టెస్ట్ క్రికెట్ చరితలో ఇదే తొలిసారి. బుధవారంనుంచి ప్రారంభమైన రెండోటెస్ట్‌లో తొలిరోజు బంగ్లాదేశ్ 172పరుగులకు ఆలౌట్‌కాగా.. న్యూజిలాండ్ జట్టు 55పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68